కొమ్ము శ్రీనివాస్ 9666 023180, 8096 660656

తెలుగు జాతీయ దినపత్రిక

తెలంగాణ

# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం



రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
తెలుగు-వెలుగు
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
97050 43131 8096660656



సంపుటి :03, సంచిక :17 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, బుధవారం ఏప్రిల్ 30, 2025, పేజీలు -12, వెల -5/-

%Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur


## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ



**హైదరాబాద్,29(తెలుగు - వెలుగు):** తెలంగాణ పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ సారి కొత్తగా మార్కులతో పాటు- సబ్జెక్టుల వారీగా గ్రేడ్స్ ప్రకటించనున్నారు. ఆ విధంగానే మార్క్స్ మెమోలు జారీ కానున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగిన పది పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. విడుదలయిన

వివరాలు 2లో



## ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

- సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ
- భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోడీ విస్పష్ట ప్రకటన

**న్యూఢిల్లీ,29(తెలుగు - వెలుగు):**ఉగ్రవాదాన్ని అణిచివేసే విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆపరేషన్ నిర్వహణ, సమయం, తేదీ, టార్గెట్‌లను సైన్యమే నిర్ణయిస్తుందని, భారత దళాల సామర్థ్యంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. పహల్గాం దాడి అనంతర పరిణామాలు, భద్రత, సన్నద్ధతపై ప్రధానమంత్రి తన నివాసంలో మంగళవారం సాయంత్రం కీలక సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది. పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు దారుణ మారణహోమానికి పాల్పడి వారం రోజులు పూర్తయింది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు. ఈ దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు బుద్ధి వచ్చేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద నిర్మూలనకు దృఢచిత్తంతో ఉన్నమని ప్రధాని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడం జాతీయ సంకల్పం అని ఆయన అన్నారు. సాయుధ దళాల సామర్థ్యంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. తీవ్రవాదం అణిచివేయడంలో, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవడంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ

వివరాలు 2లో

## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

- రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం
- భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి



**వరంగల్,29(తెలుగు - వెలుగు):** దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి నిలుస్తుందని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్న సంకల్పంతో ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ చట్టం రైతులకు శ్రీరామరక్ష అని అన్నారు.భూ భారతి 2025 చట్టంపై మంగళవారం వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ ప్రారంభానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం భూ భారతి చట్టంపై ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెం టేషన్ ద్వారా ప్రదర్శించి అందులోని అంశాలను జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణి వల్ల రైతుల వారసత్వంగా వచ్చే భూమిని అనుభవించలేక

వివరాలు 2లో

## మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

- లోటుపాట్లు లేకుండా పక్కాగా భద్రతా చర్యలు
- చారిత్రక ప్రాంతల సందర్శనకు ఏర్పాటు చేయండి
- అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,29(తెలుగు - వెలుగు):**మిస్ వరల్డ్ పోటీలను అయతంత కట్టుదిట్టమైన భద్రతమధ్య నిర్వహించాలని, ఎక్కడా లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులనురేవంత్ రెడ్డి ఆదేశించారు. అందులోభాగంగా ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు అందాల పోటీలు జరిగే ప్రదేశాల్లో

వివరాలు 2లో



## ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు

- ముగ్గురు కార్మికుల దుర్మరణం

**యాదాద్రి భువనగిరి,29(తెలుగు - వెలుగు):** జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. మోటకొండూరు మండలం కాటేపల్లి వద్ద ఉన్న ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది.పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి

వివరాలు 2లో



## గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు నర్సింగ్ విద్యార్థుల దుర్మరణం

**గద్వాల,29(తెలుగు - వెలుగు):**జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు-చేసుకుంది. జిల్లా కేంద్రంలో నర్సింగ్ విద్యార్థులను బోలేరా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఐదుగురు విద్యార్థినులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడని వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు- వైద్యులు తెలిపారు. నర్సింగ్ కాలేజ్ నుంచి హాస్టల్ కు వెళ్లే క్రమంలో బస్ పాయింట్ దగ్గర ఆగినప్పుడు ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గద్వాల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులు మృతి చెందడం పట్ల ఆరోగ్యశాఖ మంత్రి దామోదర

వివరాలు 2లో

## బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

- కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికలో అవినీతి ప్రస్తావన లేదు
- ఉత్తమ్ వ్యాఖ్యలను ఖండించిన మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్,29(తెలుగు - వెలుగు):** కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు.

వివరాలు 2లో

## పాక్ ప్రతినిధుల్లా కాంగ్రెస్ నేతల తీరు

- సోషల్ మీడియాలో మోడీపై అభ్యంతరకర పోస్టులు - పాక్ నేతలు రీ ట్వీట్ చేయడం దేనికి సందేశం - కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

- కేంద్రం నివేదకను తప్పుపట్టడం దుర్మార్గం
- సొంత నిర్ణయాలతో లక్షకోట్లు నీటిపాటుచేశారు
- అయినా సిగ్గూఎగ్గు లేకుండా మాట్లాడితే ఎలా..?
- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,29(తెలుగు - వెలుగు):** కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కావాలని ఎదురు దాడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిం చాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇంతపెద్ద కుంభ కోణం జరిగి లక్షకోట్లు నీటి పాలైతే దానిమీద వారికి చీమకుట్టినట్లుగా కూడా

వివరాలు 2లో

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం


## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పదో తరగతి ఫలితాలను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఇక నుంచి పదో తరగతి మెమోల్లో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు పొందుపరచనున్నారు. చివరగా విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా? అనేది వివరంగా ఇస్తారు. ఇంకా బోధనేతర కార్యక్రమంలో స్టూడెంట్స్‌కు గ్రేడ్లు ఇస్తారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీ–స్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రిస్తారు.

## ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అక్కడకు చేరుకొని పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మోటకొండూరులోని ప్రీమియర్ ఎక్స్ ఎ÷–లోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది. పేలుడు ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి భవనం కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న నలుగురు కార్మికులు గాయపడ్డారు. మరో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు.. ఘటనా స్థలంలో ఇద్దరు మృతి చెందారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద ఇద్దరి మృతదేహాలు ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జేసీబీ సహాయంతో శిథిలాల్లో చిక్కుకున్న వారికోసం గాలింపు చేపట్టారు. కార్మికుల మృతితో గ్రామస్తులు కంపెనీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

## గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

రాజనర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న అమ్మాయిలు, చిన్న వయసులోనే ఇలా మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, మృతుల కుటుంబాలకు అండగా ఉండాలని వారికి సూచించారు. ఇదే ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మరో విద్యార్థినికి అవసరమైన వైద్య సాయం అందించాలని కలెక్టర్‌ను, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతి ప్రకటించారు. మరణించిన విద్యార్థినుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టు–కుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

## కర్రెగుట్ట చుట్టూ మందు పాతరలు

### - ఆచితూచి అడుగేస్తున్న బలగాలు

**ములుగు,29(తెలుగు - వెలుగు):** తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ఎనిమిది రోజులుగా కేంద్ర బలగాలు కర్రెగుట్ట అడవులను తమ ఆధీనంలోకి తీసుకొని మావోయిస్టుల కోసం అన్వేషిస్తున్నాయి. వేలాది కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను నిరంతరంగా చేపడుతున్నాయి. సుమారు వెయ్యి మంది మావోయిస్టులు కర్రెగుట్టల్లోని సొరంగాలలో ఉన్నారనే సమాచారం మేరకు కూంబింగ్ బలగాలు ఆ దిశగా వేట కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని చత్తీస్‌గఢ్ పోలీసులు ధ్రువీకరించారు. అయితే, కర్రెగుట్టల చుట్టూ మావోయిస్టులు భారీగా మందుపాతరలు అమర్చడంతో కూంబింగ్ ఆపరేషన్ ఆలస్యమవుతోందని తెలుస్తోంది. మావోయిస్టులు అమర్చిన సుమారు 100కు పైగా బాంబులను కేంద్ర బలగాలు నిర్వీర్యం చేసినట్లు– సమాచారం. మావో యిస్టులు బీరు బాంబులను సైతం అమర్చగా వాటిని చూసిన కేంద్ర బలగాలు ఆశ్చర్యం వ్యక్తం పరుస్తున్నట్లు– తెలుస్తోంది. కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు– జోరుగా ప్రచారం జరుగుతుండటంతో కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేశాయి. ఇదిలా ఉండగా కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి.

## ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా సైన్యానిదే అని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని అధ్యక్షతన ఈ సమావేశం దాదాపు గంటన్నరపాటు– కొనసాగింది. ఈ సమావేశంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ పాటు– వివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు– తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ– కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ– సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు– రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు. ఇలా కీలక భేటీ–లు జరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు– చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే, 2016లో ఉరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. అనంతరం 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో జరిగిన దాడి అనంతరం భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ చేపట్టిన సంగతి తెలిసిందే.

## మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ పోటీలకు వచ్చే అతిథులు .. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు– చేయాలన్న సూచించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఇవి మే 7వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు.దేశ,విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీ–ల్లో పాల్గొనేందుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీ–లు ప్రారంభమవుతున్నాయి. మే 12వ తేదీన బుద్ధభవన్‌లో అందాల భామలతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు– చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, హదరాబాద్‌లలో హెరిటేజ్ వాక్‌లు ఏర్పాటు– చేశారు. ఇక మే 13వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరాంగులు, అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## పాక్ ప్రతినిధుల్లా కాంగ్రెస్ నేతల తీరు

- సోషల్ మీడియాలో మోడీపై అభ్యంతరకర పోస్టులు
- పాక్ నేతలు రీ ట్వీట్ చేయడం దేనికి సందేశం
- కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్,29(తెలుగు - వెలుగు):** పాకిస్తాన్ ఆలోచనల ప్రకారం కాంగ్రెస్ వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతను మరిచి ప్రధానమంత్రిని కించపరిచేలా సోషల్ మీడియా పోస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. దాయాది దేశంతో యుద్ధమేఘాలు కమ్ముకున్న సమయంలో.. బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్ పార్టీ.. అన్ని విలువలకు తిలోదకాలిచ్చింది. పాకిస్తాన్, ఉగ్రవాదులు మాట్లాడుతున్న భాషలో.. మాట్లాడుతోంది. పాకిస్తాన్ మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతల ఆలోచన ఒకే రకంగా ఉందని అర్థమవుతోందన్నారు. పాకిస్తాన్ మంత్రులు.. భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడితే, దానికి మద్దతుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు. కాంగ్రెస్ నేతలు చేసిన ట్వీవట్లను పాకిస్తాన్ రీట్వీట్ చేయడం.. వీరిద్దరి మధ్య ఉన్న అక్రమ స్నేహబంధానికి అద్దం పడుతోంది. పహల్‌గామ్ ఘటన తర్వాత.. భారతీయుల రక్తం ఉడుకుతోంది. పాక్ కు దిమ్మతిరిగే సమాధానం ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ సమయంలో ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి, భారతీయ సైన్యానికి అండగా ఉండాల్సిన బాధ్యతను మరిచిన కాంగ్రెస్ పార్టీ.. ఉగ్రవాదుల భాషలో మాట్లాడుతుండటం అత్యంత హేయమైనచర్య. ప్రధానమంత్రి చిత్రంలో తలను తొలగించి 'గాయబ్'అని పోస్టు చేయడం కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న అసహనానికి నిదర్శనమని అన్నారు. ఈ సారి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మద్దతిచ్చాయి. మజ్లిస్ పార్టీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మజ్లిస్ పార్టీని ఎదిరించే సత్తా బీజేపీకే ఉందనే సంకేతాలు స్పష్టంగా హైదరాబాద్ ప్రజలకు ఇచ్చాం.. రాబోవు గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ, మజ్లిస్ పార్టీల మధ్యే పోటీ ఉంటుందని కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో కంటే మోడీ వచ్చాక ఉగ్రవాదం పూర్తిగా తగ్గింది.. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ లో అనేక సార్లు బాంబు బ్లాస్ట్ లు జరిగాయి.. ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ విధానంతో మంచి ఫలితాలు వచ్చాయి.. 370 రద్దు తర్వాత కశ్మీర్ అభివృద్ధి వైపుకు పయనిస్తుంది.. కశ్మీర్ అభివృద్ధి ఈ దేశంలో ఉన్న అంతర్గత శక్తులకు, పాకిస్తాన్ శక్తులకు ఏమాత్రం ఇష్టం లేదు.. శాంతి సమస్యతో ముందుకు వెళ్తున్న కశ్మీర్ ను చూసి పాకిస్తాన్ సహించలేకపోతుంది.. పెహల్గంలో హిందువులు, ముస్లింలను విభజించి, అతి కిరాతంగా కాల్చి చంపారు.. కశ్మీర్ సినిమాను నాడు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకింది.. నేడు పెహల్గం ఘటన అదే కశ్మీర్ ఫైల్స్ సినిమాను తలపించింది.. పెహల్గం ఘటనను యావత్ దేశం వ్యతిరేకిస్తోంది.. దేశం శాంతి, సామరస్యంతో ఉండాలి.. ఉగ్ర శక్తులు భారతాన్ని ఏం చెయ్యలేవు.. భారత ప్రజలు ఐకమత్యంతో కలిసి ముందుకు నడవాలని మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. 'ఎన్‌డీఎస్‌ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమిషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమిషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే..ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందని అన్నారు. వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఇంతకన్నా సిగ్గుచేటు మరోటి ఉండదన్నారు. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలుపెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు– చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని ఉత్తమ్ మండిపడ్డారు. వజ్రోత్సవ సభలో ఏదేదో మాట్లాడిని కెసిఆర్ దీనిపై ఎందుకు నోరు మెదపలేదన్నారు. ఎన్‌డీఎస్‌ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది. తుమ్మడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది. ఇవన్నీ మరచి బిఆర్ఎస్ నేతలు మాట్లాడడానికి సిగ్గుండాలని అన్నారు.

## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

(మొదటి పేజీ తరువాయి)

అనేక సమస్యలు ఏర్పడ్డాయని, వాటి చిక్కుముడి విప్పడానికే భూ భారతి దోహదపడుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచల వ్యవస్థను తీసుకువచ్చినట్లు– తెలిపారు. సభలో రైతులు కొంగరి భాస్కరరావు, విజయ్ కుమార్, గోపాల రాధాకృష్ణ సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ప్రజలకు అందినప్పుడు దానికి సార్థకత చేకూరుతుందని, అందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రికార్డుల్లో తప్పుల సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూముల సర్వే, మ్యాప్ తయారీ , పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిజాయితీగా పనిచేయాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వరంగల్ నగర పరిధిలోని 32వ డివిజన్ బిఆర్‌నగర్‌లో మంగళవారం సన్నబియ్యం లబ్ధిదారుడు సింగబోయిన అనిల్ కుమార్ ఎల్లమ్మ ఇంట్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎంఎల్ఏ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్విని థానాజీ వాకడే భోజనం చేశారు. లబ్ధిదారులు అందించిన ఆతిథ్యానికి ముగ్ధులైన మంత్రులు అన్నదాత సుఖీభవ అంటూ కుటుంబ సభ్యులను శాలువతో సత్కరించి, నజరానా అందజేశారు.

## ఆపరేషన్ కగార్‌ని నిలిపివేయాలి

- ఆదివాసీల ప్రయోజనాలకు విఘాతం కలిగించొద్దు: మంత్రి సీతక్క వెల్లడి

**వరంగల్,29(తెలుగు - వెలుగు):** ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు.మావోయిస్టు పార్టీలను సమూలంగా అంతమొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ, చత్తీస్‌గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని తెలిపారు. అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటు–న్నానని తెలిపారు. ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దన్నారు. ఆ జాతి బిడ్డగా ఆదివాసులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని అన్నారు. కాగా.. మంత్రి సీతక్కను పీఎస్ కమిటీ– బృందం కలిసింది. కాగా.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై ఎనిమిదవ రోజు భద్రతా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలపైకి భారీగా బలగాలు చేరుకుంటున్నాయి. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు– చేస్తున్నట్లు– సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు, ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా భద్రతా బలగాలు తరలిస్తున్నాయి. ఆపరేషన్ కర్రెగుట్టలపై కేంద్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ బలగాలు గత వారం రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. ఆపరేషన్ కర్రెగుట్టలు నిలిపివేయాలని ఓ వైపు ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి. అటు– మావోయిస్టులు కూడా ఇప్పటికే మూడు నాలుగు సార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అంతేకాకుండా కర్రెగుట్టలపై బేస్ క్యాంప్‌ను ఏర్పాటు– చేస్తున్నట్లు– తెలుస్తోంది. ఈరోజు ఒక్కరోజే వెంకటాపురం సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి కర్రెగుట్టలపైకి రెండు హెలికాప్టర్లు నాలుగు సార్లు అక్కడకు వెళ్లి బలగాలు, మందుగుండు సామాగ్రిని తరలించాయి. వడదెబ్బ కారణంగా 40 మంది జవాన్లు వెనక్కి వచ్చినప్పటికీ రెట్టింపు సంఖ్యలో బలగాలను చేరవేస్తూ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.



## ఎన్‌డిఏ కూటమి అభ్యర్థికి ఎమ్మెల్యే నల్లమిల్లి శుభాకాంక్షలు



**తెలుగు - వెలుగు,తూ.గో. జిల్లా బ్యూరో(అనపర్తి) :** రాజ్యసభ ఉప ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బిజెపి క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఏపీ సచివాలయంలో నామినేషన్ వేస్తున్న వెంకట సత్యనారాయణ ను ఎమ్మెల్యే నల్లమిల్లి కలిసి శాలువా కప్పి బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎన్డీఏ నేతలు ఉన్నారు.

## భారత్ దాడిని ఎదుర్కొనేందుకు పాకిస్తాన్ సిద్ధంగా ఉంది


### - భయపడుతూనే గాంభీర్యం ప్రదర్శిస్తున్న పాకిస్తాన్ రక్షణ శాఖ



**హైదరాబాద్:ఏప్రిల్ 29:** పహల్గాం ఉగ్ర దాడి ఘటన తరువాత తమ దేశంపై ప్రతీకార దాడి చేసేందుకు భారత్ రగిలిపోతోందని పాకిస్థాన్ నేరుగానే చెబు తోంది. తాజాగా పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాట్లాడుతూ పాకిస్థాన్ పై భారత్ దాడికి పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పాక్ మిలిటరీ ప్రభుత్వానికి చెప్పిందన్నారు. ఈ నేపథ్యంలోనే భారత్ దాడులను తిప్పికొట్టేందుకు పాకిస్థాన్ బలగాలను రంగంలోకి దించినట్లు రక్షణ శాఖ మంత్రి చెప్పారు. భార త్ ఎలాంటి దాడి జరిపినా, దానిని ఎదుర్కునేందుకు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉందని ప్రకటించారు. పాక్ మనుగడకు ప్రమాదం ఉందంటే అవసరమైతే అణ్వాయుధాలను ఉపయోగించేందుకైనా వెనుకాడబోమని ఖ్వాజా అన్నారు. అంతర్జాతీయ వార్త సంస్థ రాయిటర్స్ తో మాట్లాడు తూ పాక్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజ ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా దాడి చేసే ప్రమాదం ఉందన్న సంకేతాల నేపథ్యంలో ఆ దాడిని ఎదుర్కునేందుకు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది అని ముహమ్మ ద్ ఖ్వాజా ఆసిఫ్ తెలిపారు. భారత్ ను చూసి భయ పడుతూనే... పాక్ రక్షణ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్య లు చూస్తోంటే, భారత్ ఏ క్షణం ఎటువైపు నుంచి మెరుపు దాడి చేస్తుందా అని హడలి పోతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. అయితే, ఇంత భయం లోనూ పాకిస్థాన్ మళ్ళీ భారత్ పై బెదిరింపు చర్యలకు దిగడం ఆపడంలేదు. అందుకే భారత్ జరిపే దాడి భయంకరంగా ఉన్నట్ల యితే, తాము అణ్వా యుధాలు ప్రయోగిస్తామని చెబుతోంది. ఇదిలా ఉంటే మరోవైపు భారత్, పాకిస్థాన్ సరిహద్దుల వెంట పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. వరుసగా నాలుగో రోజు అయిన సోమవారం కూడా పాక్ కాల్పుల విరమణ ఒప్పందానికి పాల్పడింది.

## నేడే పదో తరగతి పరీక్ష ఫలితాలు

**హైదరాబాద్:ఏప్రిల్ 29:**విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..ఈ సారి రిజల్ట్ లో సబ్జెక్ట్ వారిగా మార్కులు, గ్రేడ్ పాయింట్లు..గత నెల 24 నుంచి ఈ నెల 4 వరకు జరిగిన పదోతరగతి పరీక్షలు..ఈఏడాది పరీక్షలకు హాజరైన 5లక్షల మంది విద్యార్థులు.....



## కాలినడకన బిక్కవోలు లక్ష్మి గణపతి ఆలయానికి మహాలక్ష్మి



**తెలుగు - వెలుగు,తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** భక్తులు ఆలయాలకు వెళ్లడం,తమ బాధలను తీర్చి కోరికలను నెరవేర్చమని ప్రార్థించడం, పూజలు చేయడం మామూలే. కానీ బిక్కవోలు లక్ష్మి గణపతి దేవాలయంలో మాత్రం తమ వినతులను స్వయంగా స్వామి చెవిలోనే చెప్పుకుంటారు. కోరిన కోరికలు నెరవేరిన తర్వాత పునః దర్శనానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. మంగళవారం అదే తరహాలో అనపర్తి మండలం రామవరం నుండి తమ కోరిక తీర్చిన బిక్కవోలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మి గణపతి స్వామి దేవస్థానం వరకు కాలినడకన వెళ్లి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి తమ మొక్కుబడి చెల్లించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నల్లమిల్లి విజయం సాధించిన సందర్భంగా స్వగ్రామం రామవరం నుండి రాయవరం,కొమరిపాలెం, తొస్సిపూడి,పందలపాక, ఉలపల్లి మీదుగా బిక్కవోలు లక్ష్మి గణపతి ఆలయానికి మహాలక్ష్మి(25 కిలోమీటర్లు) కాలినడకన చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మి గణపతిని దర్శించుకున్నారు. దీనికి ముందు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లక్ష్మి గణపతిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నల్లమిల్లి సనాతని, నల్లమిల్లి సుబ్బారెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి(సత్తాలు), జుత్తుక సూర్యకుమారి,శివ రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

- మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదానం



షాద్ నగర్ మున్సిపాలిటీ 12వ వార్డు పెద్ద జానంపేట వివేకానందకాలనీలోని పోచమ్మ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మలగారి సత్యనారాయణ తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరం చైత్ర మాసం పురస్కరించుకొని దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అమ్మవారికి ముక్కుపుడక, బొట్టు, కండ్లు సమర్పించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, మాజీ కౌన్సిలర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు ప్రదీప్, రాఘమరెడ్డి, ముత్యాలు, యూత్ సభ్యులు, భక్తులు ఆర్ కైలాస్ నాథ్, ఆర్ ప్రసాద్, ఎస్ కుమార్, శ్రీశైలం విజయ్, భూషం నరేష్, తేజ, కాలనీ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మలగారి సుదర్శన్, పి సంతోష్, ఎం రవి, సురేష్, పి సాయి, కృష్ణ, నరేందర్, నరేష్, యూత్ సభ్యులు జీవన్, చింటూ, సాయి, శ్రీకాంత్ హరీష్, మహిళలు పాల్గొన్నారు.

## వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ • కొందుర్గులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్ నగర్ మార్కెట్ యాడ్ లో కొందుర్గ్ ప్రాథమిక సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్‌కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవ ద్దని సూచించారు,ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణ, హమాలీలు, గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికపరంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడినిచ్చే పంటలను సాగు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి,కొందుర్గ్, ఫరూఖ్ నగర్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్లు బక్కన్న యాదవ్, దామోదర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మల్లేష్, కరుణాకర్, భాస్కర్,నవీన్, భరత్, రవినాయక్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, అగ్గనూర్ బస్వం, ఇబ్రహీం, బాలరాజు గౌడ్,సుదర్శన్ గౌడ్, హరినాద్ రెడ్డి,నర్సింలు, కుమారస్వామి గౌడ్, చంద్రశేఖర్, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్,కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ,,మహబూబ్ షరీఫ్, రఘునందన్ సుదర్శన్, అనిల్,గంగమోని సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు

## సెక్యూరిటీ గార్డ్ కనబడుటలేదు

### - పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఒరిస్సా కు చెందిన వలస కార్మికుడు సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్న బసంత్ బెహరా నిన్నటి నుండి కనబడుటలేదని ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని సెక్యూరిటీ గార్డ్ ఏజెన్సీ నిర్వాహకుడు ధనరాజ్ రెడ్డి తెలిపారు. నిన్నటి నుండి బసంత్ బెహరా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని తన ఆచూకీ కనబడడం లేదని రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ధనరాజ్ రెడ్డి తెలిపారు. కేశంపేట మండలం కొత్తపేట వద్ద ఉన్న వెంకటేశ్వర హాచరీస్ లో బసంత్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నట్లు ధనరాజ్ రెడ్డి పేర్కొన్నారు. ఇతని ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలుపవలసిందిగా ఆయన కోరారు.

## భారత విమానాశ్రేయం సంస్థ మూసివేత

- పాకిస్తాన్ విమానాల రాకపోకలపై నిషేధం



**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్–పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తమపై ఆంక్షలు విధించిందనే అక్కసుతో భారత్పై పాకిస్థాన్ విషం చిమ్మింది. తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ కూడా దీనిపై ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. "ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు" అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఒకవేళ దీనిపై భారత్ నిర్ణయం తీసుకుంటే.. అది పాక్ ఎయిర్లైన్లపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉంది. పాక్ విమానాలు కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే.

## మే డేను జయప్రదం చేయండి!

- మే డే స్ఫూర్తి తో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి! • బీజేపీ తీసుకొస్తున్న 4 లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాడుదాం! కార్మిక హక్కులను కాపాడుకుందాం!!
- పినపాక ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్, కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ



కేంద్రలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాల మార్పు చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటు పరం చేయటం లాంటి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, కార్మిక రంగాన్నే నిర్వీర్యం చేస్తూ, కార్మికులను కట్టు భానిసలుగా చేసి యాజమాన్యాలకు లాభాలు చేకూర్చే విధంగా చేస్తున్న ప్రయత్నాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని, ఈ మేడే స్ఫూర్తి తో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే అనేక రంగాలలో కార్మికులు ఉపాధి కోల్పోయి అనేక అవస్థలు పడుతున్నారు. ఉపాధి కోల్పోయిన కార్మికులను ఆదుకోకుండా సోద్యం చూస్తోంది. ఇప్పటికే అనేక పరిశ్రమలు శాశ్వత కార్మికులను తొలగించి, చట్టాలకు వ్యతిరేకంగా రోజువారీ కార్మికులను నియమించుకుని బానిసలు లా పనిచేయించు కుంటున్నారు అని, ప్రావిడెంట్ ఫండ్ కట్టకుండా ఎగ వేసిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం లేదని, పరిశ్రమలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టా రాజ్యాంగ భద్రతా ప్రమాణాలను పాటించక పోవడం తో అనేక పరిశ్రమలలో ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్నారని. అయినా చర్యలు లేవన్నారు. కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇప్పటికే ఉన్న అనేక చట్టాలు అమలు కాక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతుంటే ఉన్న చట్టాలు అమలు చేసే బాధ్యత తీసుకోకుండా యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను మార్చి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుంది. ఈ లేబర్ కోడ్ లు అమలైతే కార్మికులు కట్టు బానిసల్లా బతకాల్సిన పరిస్థితి .. కావున ఈ లేబర్ కోడ్ లను రద్దు చేయటం కోసం ఈ నెల 20 న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. సంఘాలు ఎన్ని ఉన్నా, ఎవరి జెండా అజెండా వేరైనా కనీసం ఈ మేడే నుండైనా సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, అందరూ కార్మిక సంక్షేమం కోసం ఐక్య ఉద్యమాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. ఇంత జరుగుతున్నా కార్మిక వర్గం కొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకుల మాయ మాటలలో పడి మోసపోతున్నారని, వారిని చైతన్య పరిచి వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యతను తీసుకోవాలని, కార్మికుల కోసం, కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని, జెండాలో గుర్తులు ఎన్ని ఉన్నా న్యాయం జరిగేది ఎర్రజెండా తోనే అన్నారు. ఈ మేడే సందర్భంగా జరిగే కార్యక్రమాలలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలి

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య

చౌదరి గూడ మండలం రావిరాల గ్రామంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు దీమ యాదయ్య ఆధ్వర్యంలో గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్ రావు పాల్గొనడం జరిగింది.రావిరాల గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని, రేషన్ షాప్ ను సందర్శించి వివరాలు సేకరించడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, సుధాకర్ రావు ఇరువురు మాట్లాడుతూఅంగన్వాడీ కేంద్రానికి పూర్తి నిధులు కేంద్ర ప్రభుత్వం నిదులే అని అన్నారు. అదేవిదంగా అంగన్వాడీ కేంద్రం లబ్ది దారులను కలిసి నరేంద్రమోదీ సంక్షేమ పథకాలను వివరించడం జరిగింది. రేషన్ షాప్ లో అంత్యోదయ పథకం ద్వారా 35 కిలోల బియ్యం, ప్రతి ఒక్క లబ్ధి దారునికి 5 కిలోల ఉచిత బియ్యం కేంద్ర ప్రభుత్వానివే అని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిదులే కాబట్టి గ్రామంలో ప్రతి లబ్ధిదారునికి తెలియజేయాలని కార్యకర్తలకు సూచించడం జరిగింది. వచ్చేవి స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి కేంద్ర ప్రభుత్వం యొక్క సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో బిజెపి జెండా ఎగురావేయాలని అన్నారు. ఈయొక్క కార్యక్రమలో బిజెపి నాయకులు బోయ కుర్మయ్య, పసుపుల ప్రశాంత్, కొండ శ్రావణ్,గొల్ల రాజు, అనిల్, రాజు, పరిగి శివ కుమార్, విటలయ్య, సత్యం, ఇస్తారయ్య, లక్ష్మయ్య, చెనగాళ్ల యాదగిరి, చిల్ల రమేష్, కోట్ల ప్రశాంత్ రెడ్డి, బండ గోధుమరాసి మల్లేష్, దశరథం, చిల్ల తిరుపతయ్య, పవన్ కుమార్, శ్రీను, శ్రీను,తదితరులు పాల్గొన్నారు..





## ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించబోము: ప్రధాని నరేంద్ర మోడీ...

● ఆర్మీ కె పూర్తి స్వేచ్ఛ ● 140 కోట్ల భారతీయులకు సైన్యంపై పూర్తి నమ్మకం మోడీ

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్లోని పెహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.మంగళవారం సాయంత్రం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, త్రివిధ దళాల అధిపతులు.. సీడీఎస్ అనిల్ చౌహాన్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ సహా పలువురు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని.. కూకటి వేళ్లతో సహా అంతం చేస్తామని సంచలన ప్రకటన చేశారు.ఉగ్రవాదంపై పోరులో భారత సైన్యానికి(ఇండియన్ ఆర్మీ) పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు 140 కోట్ల భారతీయులకు సైన్యంపై పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని అన్నారు. పెహల్గాంలో కాల్పులకు తెగబడి అమాయకుల్ని పొట్టనబెట్టుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టమని అన్నారు. అత్యంత కఠినంగా శిక్షించడంతో పాటు.. వారికి సహకరిస్తున్న వారికి ధీటైన జవాబు ఇస్తామని.. ఇందుకు తేదీ, సమయం భారత సైన్యమే డిసైడ్ చేస్తుందని తెలిపారు.ఉగ్రవాదులకు ఎలాంటి శిక్ష విధించాలో సైన్యమే నిర్ణయిస్తుందని అన్నారు. మళ్లీ భారత్ వైపు కన్నెత్తి కూడా చూడకుండా సైన్యం స్ట్రాంగ్ రివేంజ్ తీర్చుకుంటుందనే నమ్మకం తనకుందంటూ సంచలన కామెంట్స్ చేశారు.

## ప్రజా సంఘాల నిర్మాణాలను పటిష్టం చేయాలి



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** ప్రజా సంఘాల నిర్మాణాలను పటిష్టం చేయాలని సిపిఐఎంఎల్ మాసల్కైన్ నాయకులు గోకినేపల్లి ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం అశ్వారావుపేట మాస్ లైన్ ప్రజాపంథా కార్యాలయంలో పిఓబ్ల్యు – పి వై ఎల్ జనరల్ కౌన్సిల్ సమావేశాలు బాడిస లక్ష్మణ్ రావు, కొమరం చిన్న లక్ష్మి ల అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంలో గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని స్త్రీలను సమాజంలో రెండవ తరగతి పౌరులుగా చూడ బడుతు న్నారని మను ధర్మం పేరుతో సమాజంలో అసమానతలను పెంచి పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కార్య దర్శి వాసం బుచ్చిరాజు మాట్లాడుతూ సమాజంలో యువతరం మత్తులో జోగుతున్నారని విష సంస్కృతికి లోన్కె సామాజిక స్పృహను కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పిఓడబ్ల్యూ, పివైఎల్ నూతన కమిటీలను ఎన్నుకున్నా రు. పి ఓ డబ్ల్యు అధ్యక్షురాలుగా గోకినేపల్లి గంగ, ఉపాధ్యక్షు రాలుగా కంగాల వీరమ్మ, కార్యదర్శిగా కంగాల భూలక్ష్మి, కోశాధికారిగా కొమరం చిన్న లక్ష్మి, సహాయ కార్యదర్శిగా పూసం శారదలను ఎన్నుకున్నారు. అదే విధంగా పివైఎల్ మండల నూతన అధ్యక్షుడిగా కారం మల్లేష్, కార్యదర్శిగా కుంజా అర్జున్, కోశాధికారిగా కంగల వెంకటేష్ ఎన్నుకోవడం జరిగింది.



## షాద్ నగర్ అసెంబ్లీకి పోటీ చేస్తా..!

● అధిష్టానం ఆదేశిస్తే నా సత్తా చూపిస్తా - బస్తీ మే సవాల్

● షాద్ నగర్ బిఆర్ఎస్ యువ నాయకుడు రాజా వరప్రసాద్ సంచలన కామెంట్స్

● విమర్శలను స్వీకరిస్తా.. భయపడను

● ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" కు బి ఆర్ ఎస్ తరపున నేనే గట్టి పోటీ



**షాద్ నగర్ :** అధిష్టానం ఆదేశిస్తే షాద్ నగర్ అసెంబ్లీ స్థానం నుండి భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తరపున అభ్యర్థిగా పోటీ చేస్తానని ఇప్పటినుండి స్థానికంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటానని రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్, షాద్ నగర్ సీనియర్ ఉద్యమ నాయకుడు రాజా వరప్రసాద్ సంచలన కామెంట్స్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తనపై ఎవరైనా విమర్శలు చేస్తే వాటిని స్వీకరిస్తానని భయపడబోనని స్పష్టం చేశారు. తనపై విమర్శలు చేస్తున్న వారికి ఒకటే సమాధానం చెప్పగలనని తెలిపారు. కౌన్సిలర్ గా పోటీ చేస్తే 10 ఓట్లు రాలేదని చెప్పిన వారికి కనువిప్పు కలిగించేందుకు తాను అవసరమైతే ఎమ్మెల్యే అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీచేసి తన సత్తా ఏమిటో నిరూపిస్తానని సవాల్ విసిరారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు, కాంగ్రెస్ పార్టీకి తానే బలమైన ప్రత్యర్థిని అవుతానని స్పష్టం చేయడం గమనార్హం. బిఆర్ఎస్ పార్టీలో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డిలు ఉన్నారని అయితే తాను కూడా పార్టీ సీనియర్ నాయకుడిగా ఎన్నో సేవలు అందించిన సందర్భాలు ఉన్నాయని ఉద్యమకారుడి నుండి నేటి వరకు పార్టీకి అంకితభావంతో పనిచేశానని అవకాశాలు పార్టీలో అందరికీ రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీలో రాజకీయంగా నాయకులపరంగా మార్పులు సంభవిస్తుంటే ప్రజల్లో కొత్త ఉత్సాహం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రస్తుత తరుణంలో అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేక భావన చాలా ఉందని దీనిని బిఆర్ఎస్ పార్టీ ఉపయోగించుకుని మళ్ళీ గులాబీ జెండాను రెపరెపలాడే విధంగా చూసే బాధ్యత తమలాంటి ఉద్యమకారులపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. అధిష్టానం ఆదేశిస్తే దేనికైనా తాను సిద్ధమని ఎమ్మెల్యేగా మాత్రం కచ్చితంగా పోటీ చేసేందుకు తాను కూడా బరిలో ఉన్నానని అధిష్టానానికి ఈ విధంగా ఆయన సంకేతాలు పంపించారు. రాజా వరప్రసాద్ ప్రకటనతో బిఆర్ఎస్ పార్టీలో కార్యకర్తల నుండి ఇతర నాయకుల నుండి ఎలాంటి ప్రతిస్పందన లభిస్తుందో వేచి చూడాల్సిందే..!

## కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

● సంఘటన సంరచన ఇంచార్జ్‌లు డా. ప్రేమ్ రాజ్, శ్రీధర్





**షాద్‌నగర్:** ఈ రోజు షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో షాద్‌నగర్ టౌన్ మరియు ఫరూఖ్‌నగర్ మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. ప్రేమ్ రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గారు పాల్గొన్నారు.సభను ఉద్దేశించి డా. ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ, దేశంలోనే అత్యధిక ప్రజాధారణ పొందిన పార్టీగా బీజేపీ నిలిచిందని, ప్రధాని నరేంద్ర మోదీ గారి నేతృత్వంలో పార్టీ అన్ని స్థాయిల్లో బలపడుతోందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం కోల్పోయారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బూత్ స్థాయిలో పార్టీ సిద్ధంగా ఉందని, కార్యకర్తలు మరింత కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ "ఆరు గ్యారెంటీలు" పేరిట ఇచ్చిన హామీలు ఆచరణలో లేకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు దేపల్లి అశోక్ గౌడ్, కక్కునూరు వెంకటేష్ గుప్తా, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ప్యాట్ అశోక్, సీనియర్ నాయకులు మల్చలం మురళి, యువ నాయకులు ప్రశాంత్ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రుషికేశ్, దూడల వెంకటేష్, పట్టణ అధ్యక్షులు హరిభూషణ్, మండల అధ్యక్షులు సురేష్, మిద్దెల గణేష్, బోయ కురుమయ్య, జంబుల నర్సింలు, తదితర నేతలు పాల్గొన్నారు

## వివాహ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు....

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** మియాపూర్ సత్యభారతి కన్వెన్షన్ లో ఉప్పల చంద్రశేఖర్, శ్వేత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వారి కుమార్తె అక్షిత యొక్క నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో వారి ఆహ్వానం మేరకు వడ్డేపల్లి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసి అక్షితను ఆశీర్వదించారు.



## ట్యాంక్ బండ్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో పైల్గాం ఘటనలో మృతి చెందిన భారతీయులకు నివాళులు...

● శేర్లింగంపల్లి నుండి పాల్గొని నివాళులర్పించిన కార్పొరేటర్ దొడ్ల నాయకులు...





**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** ట్యాంక్ బండ్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ల నిర్వహణలో జమ్మూకాశ్మీర్ లోని పహల్గాం లో జరిగిన పాకిస్తాన్ ఉగ్రదాడికి నిరసనగా మరణించిన వారికి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలకు సంఘీభావంగా నిలబడటానికి నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని నివాళులు అర్పించారు.

## భాగ్యనగర్ కాలనీలో దాసరి శ్రీనివాసరావు, ప్రసన్నల జ్ఞాపకార్థంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** దివంగత దాసరి శ్రీనివాసరావు, ప్రసన్నల జ్ఞాపకార్థంగా కె.పి.హెచ్.బి లోని భాగ్యనగర్ కాలనీలో రాహుల్ దాసరి ఆధ్వర్యంలో బాటసారులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెూప్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండా విజయ్ ముఖ్య అతిథిగా హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా విజయ్ మాట్లాడుతూ, వేసవి తాపాన్ని తీర్చేందుకు ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని, రాహుల్ దాసరి మిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ వేసవి కాలం మొత్తం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఆర్కె దయాసాగర్, శ్రీనివాస్ యాదవ్, హరికుమార్, హరికృష్ణ, సతీష్ నాయుడు, బుల్లెట్ రవి, రవీందర్, రాకేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే విజయం సొంతం అవుతుంది

● లక్ష్య సాధనలో ప్రదార్చిత అందరికీ ఆదర్శం ● యూపీఎస్సీ యాంకర్ ప్రదార్చితను సన్మానించిన అడ్వకేట్ కరీం, నోముల బసప్ప





కష్టపడి చదివిన వారికి విజయం సొంతమవుతుందని, ప్రతి ఒక్కరూ వెనకడుగు వేయకుండా లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు పోతే ఆశించిన ఫలితం తప్పకుండా వస్తుందని షాద్నగర్ సీనియర్ న్యాయవాదులు కరీం, నోముల బసప్ప అన్నారు. మంగళవారం ఇటీవల యూపీఎస్సీ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన రాఘవేందర్ రావు మమత దంపతుల కుమార్తె ప్రదార్చితను కలసి శాలువాతో సన్మానించి వారు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయం కోసం ఓపికగా వేచి చూసి అందుకు తగ్గట్టుగా ప్రదార్చిత పట కష్టాన్ని కొనియాడారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు, సమాజానికి ఆమె అందించే సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కట్టెల వేణన్న, జగదీష్ ఖండేల్వాల్ , నరసింహ తదితరులు పాల్గొన్నారు..

## పాక్‌కు యుద్ధ విమానాలు పంపలేదు: టర్కీ




పాక్ కు యుద్ధ విమానాలను పంపుతున్నట్లుగా వస్తున్న వార్తలను ఖండిస్తున్నట్లు టర్కీ పేర్కొన్నది. ఆ వార్తల్లో నిజం లేదని, కార్గో విమానం కేవలం ఇందనాన్ని నింపే అవసరాలకోసం పాక్లో దిగినట్లు స్పష్టం చేసింది.పాకిస్తాన్ కు ఆయుధాలతో కూడిన ఆరు విమానాలను టర్కీ పంపుతోందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఈ విషయంతో టర్కీ-భారత్ మధ్య సంబంధాల్లో మార్పు వస్తుందని పలువురు అంచనా వేస్తున్నారు.

# అదరగొట్టిన షాద్ నగర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

- ఇంటర్ విద్యార్థుల ప్రతిభ
- రంగారెడ్డి జిల్లాలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 71.6 శాతం ఉత్తీర్ణత
- 90 శాతానికి పైగా మార్కులు సాధించిన 22 మంది విద్యార్థులు
- కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం
- షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" సహకారంతో పెరిగిన ఉత్తీర్ణత
- మధ్యాహ్నం భోజనం, ఇతర సదుపాయాల కల్పనతో మెరుగైన విద్య
- "ఎమ్మెల్యే శంకర్" కు రుణపడి ఉంటామని విద్యార్థుల కృతజ్ఞతలు
- విద్యార్థులను సన్మానించిన ప్రముఖులు, నాయకులు, జర్నలిస్టులు








**షాద్ నగర్:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువులంటే చులకనగా చూసే ఈ సమాజంలో ఇప్పుడు కథ మారిపోయింది.. ప్రభుత్వ కళాశాలలో కూడా ప్రైవేటుకు ధీటుగా ఉత్తమ ప్రతిభ కనబరిచి 90 శాతానికి పైగా మార్కులు సాధించి మేము సైతం అంటున్నారు ప్రభుత్వ విద్యార్థులు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారం విద్య, సదుపాయాలకు తోడవడం చేత ఉత్తీర్ణత సాధించామని విద్యార్థులు చెబుతుంటే వారి కళ్ళల్లో కనిపిస్తున్న ఆ ఆనందమే వేరు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు 71.6 శాతం మెరుగైన ఉత్తీర్ణత శాతం సంపాదించాలని కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన వారు 22 మంది విద్యార్థులు ఉండడం విశేషం. ఇక 98.60 శాతం మార్కులు సాధించిన మానస, 96% మార్కులు సాధించిన అయేషా బేగం ఇక 90శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు మూడవత్ నికిత, స్వరూప, దివ్య, వైష్ణవి, శృతి, మాడగారి శైలజ, కేశ శివాని, భార్గవి, ఆశ, అరవింద్, శివరామకృష్ణ, విస్లావత్ జితేందర్, ఆనంద్, రామ్ చరణ్, రాణి ప్రవీణ్, స్వాతి, కావేరి, ప్రియాంక బిశ్వాల్, పి స్వామి, అర్జున్ ఉత్తమ మార్కులు సాధించడంతో వీరిని కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు ఖాజాపాషా (కెపి), వి6రాజేష్ అదేవిధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యక్తిగత కార్యదర్శి లింగారెడ్డి గూడా అశోక్ తదితర లెక్చరర్లు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

**ఎమ్మెల్యే శంకర్ సహకారం మరువలేనిది - ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి**

స్థానిక ఎమ్మెల్యే వీర్ల పొల్లు శంకర్ సహకారం మరువలేమని విద్యాభివృద్ధికి ఆయన కంకణం కట్టుకొని పనిచేస్తున్నారని దీనివల్ల తమ విద్యార్థుల ఉత్తీర్ణతపై కూడా ప్రభావం చూపించిందని ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి విద్యార్థుల సన్మాన సభలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 71% శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కళాశాల అభివృద్ధి కోసం మధ్యాహ్న భోజనం, ఫర్నిచర్ సహకారం, క్రీడా సామాగ్రి ఎమ్మెల్యే అందించడం వల్ల విద్యార్థుల హాజరు శాతం కూడా మెరుగుపడి వారిలోని ప్రతిభ కూడా బయటకు వచ్చిందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సహకారంతో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ తాము విద్యార్థులను ప్రోత్సహించామని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 527 మంది ఉండగా మూడో 72 మాత్రమే పరీక్ష ఫీజులు చెల్లించారని 150 మంది ఫీజులు చెల్లించలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా 50% మంది విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 413 మంది విద్యార్థులకు గాను 253 మంది పరీక్ష ఫీజు కట్టి పరీక్షలు రాశారని 27 మంది 80 శాతానికి పైగా మార్కులు సాధించి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇక మరో 22 మంది 90 శాతానికి పైగా మార్కులు సాధించి రికార్డు సృష్టించారని సర్వేశ్వర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తమ శాఖ కమిషనర్ కు అధ్యాపకులకు, ప్రోత్సహించిన మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**కృషి ఉంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదు - చెంది తిరుపతిరెడ్డి**

కృషి ఉంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదని కాంగ్రెస్ యువ నాయకులు చెంది తిరుపతి రెడ్డి అన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం చూస్తుంటే చూడముచ్చటగా ఉందని ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాణిస్తుండడం విశేషం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూర్వ విద్యార్థిగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇక్కడ పెద్ద ఎత్తున భవనం నిర్మించి ఇస్తుండడం అంతకన్నా ముందు విద్యార్థులకు కావలసిన సామాగ్రిని ఏర్పాటు చేయడం విద్యార్థులు ఆకలితో పస్తులు ఉండకుండా వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి విద్యకు దోహదపడడం లాంటి మంచి కార్యక్రమాలతో ప్రభుత్వ విద్యార్థులు మెరుగైన విద్యను సాధించారని ఆనందం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కడుతున్న ఈ కళాశాల రేపు రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. ఏ ఎమ్మెల్యే చరిత్రలో తీసుకొని చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని ఖర్చుకు వెనకాడకుండా ఒక గొప్ప కళాశాలను నిర్మించి ఇస్తుండడం చరిత్ర మరువదు అన్నారు. కళాశాలలో మంచి విద్యను అందించిన అధ్యాపక బృందానికి సహకరించిన ఎమ్మెల్యేకు మీడియా మిత్రులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణంలో తన వంతు క్రియాశీల పాత్ర ఉండడం జీవితంలో ఎంతో సంతృప్తిని ఇస్తుందని ఈ సందర్భంగా అన్నారు.

**చరిత్ర సృష్టించడం ఖాయం - సీనియర్ జర్నలిస్ట్ కేపి**

ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యవహారం చూస్తుంటే చరిత సృష్టించడం ఖాయమని సీనియర్ జర్నలిస్ట్ కేపీ అన్నారు. 22 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్పులు సాధించడం ఇంకా 25 మంది 80 శాతానికి పైగా మార్పులు సాధించి ఒక రికార్డు సృష్టించారని జిల్లాలోని 71.6% ఉత్తీర్ణత సాధించడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు భోజన సదుపాయం ఇతర సౌకర్యాలు కల్పించడం వల్ల ఈ ప్రగతి సాధ్యమైందని ఎమ్మెల్యే శంకర్ చేస్తున్న పనులకు మీడియా తరఫున అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కళాశాల నిర్మాణం జరిగి అన్ని వసతులు ఏర్పాటు చేస్తే 100కు 100% రిజల్ట్ రావడం ఖాయమని పేర్కొన్నారు. అధ్యాపక బృందానికి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల భవన నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, అదేవిధంగా ఇక్కడి నిర్మాణ పనులు స్వయంగా పర్యవేక్షిస్తున్న చెంది తిరుపతి రెడ్డి, లింగారెడ్డి గూడ అశోక్ లకు కూడా మీడియా తరఫున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లింగారెడ్డిగూడెం అశోక్ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధి పనులు తన వంతు కృషి ఉండడం పూర్వజన్మ సుకృతం అని విద్యార్థులు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి ఈ ప్రాంతానికి పేరు తేవాలని ఎమ్మెల్యే శంకర్ కలలు కన్నట్టుగా అందరూ ఉన్నతి సాధించాలని అశోక్ సూచించారు.

**సన్మానం.. జ్ఞాపికల ప్రధానం**

90 శాతానికి పైగా మార్కులు సాధించిన 22 మంది విద్యార్థులకు కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ప్రముఖులు చెంది తిరుపతి రెడ్డి లింగారెడ్డిగూడెం అశోక్ జర్నలిస్టులు కేపీ రాజేష్ తదితరులు ఘనంగా సన్మానించారు. శాలువాలతో సన్మానించి కాంగ్రెస్ యువనేత రాయికల్ శ్రీనివాస్ బహుకరించిన జ్ఞాపకాలను విద్యార్థులకు అందజేశారు. తమ ఉత్తీర్ణత వెనుక అధ్యాపకుల కృషి ఉందని అదేవిధంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే శంకర్ తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి విద్యార్థులు మీడియా ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకులు కరుణ, షామిలి, కే.ఉమా, అరుంధతి, కిరణ్, శ్రీదేవి, తాప్తి, జ్యోతి, రాజు, ఆయాజ్ అలీ, జ్ఞానేశ్వర్, లక్ష్మి, బాలాశ్రీ, భాస్కర్ మల్లేష్ పాల్గొన్నారు.

# కెసిఆర్, కాంగ్రెస్ నాయకులకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా..?

- కెసిఆర్‌ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదు
- జిల్లేడు చౌదరిగూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ హఫీజ్



జిల్లేడు చౌదరిగూడ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు హఫీజ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ కేసీఆర్ ని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదనీ కెసిఆర్ కాంగ్రెస్ నాయకులకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఎందుకంటే నక్క భూమి మీద నివసిస్తది. నాగలోకం ఆకాశంలో ఉంటది నాగలోకాన్ని అందుకోవడం చాలా కష్టమైన పని అని నిన్న బీఆర్ఎస్ పార్టీ సభను ఉద్దేశించి వివిధ హోదాల ఉన్న అధికార పార్టీ నాయకులు సభకు వచ్చిన జనాలను చూసి ఓర్వలేక మంత్రుల నుంచి గ్రామ శాఖ నాయకుల వరకు భయం పుట్టుకొని నోటికి వచ్చినట్లు సోషల్ మీడియాలో గాని పత్రికల్లో గాని వాళ్ళు మాట్లాడిన వార్తలు చూస్తుంటే ఓటమి వాళ్లు ఒప్పుకున్నట్లు చాలా అసహనానికి గురైనారు అని అర్థం అవుతుందనీ పేర్కొన్నారు. వాస్తవానికి గతంలోకి వెళ్తే మన తెలంగాణ రాష్ట్రం నిజాం స్టేట్ సపరేట్ గా ఉండే (హైదరాబాద్ సంస్థానం) మన షాద్ నగర్ వాసి బూర్గుల రామకృష్ణ రావు ముఖ్యమంత్రిగా ఉన్నారని మర్చిపోయారా హైదరాబాద్ స్టేట్ కు సపరేట్ కరెన్సీ ఉండేది దేశంలోనే అత్యంత సంపన్న రాష్ట్రంగా ఉన్న హైదరాబాద్ ను ఓర్వలేక ఆంధ్ర నాయకులకు తలొగ్గి మీరు జాతీయ పార్టీ అని చెప్పుకునే వాళ్లే తెలంగాణను ఆంధ్రలో అన్యాయంగా కలిపారు. ఆరోజు ఫసల్ హాలీ కమిటీ ఇష్టంలేని అబ్బాయికి అమ్మాయికి పెళ్లి చేసినట్లు ఉంటది తెలంగాణ ఆంధ్రాలో కలిపితే అని చెప్తే వినకుండా ఆంధ్రలో కలిపిన ఘనత మీకే దక్కింది. 1969 నుంచి మొదలుకొని 2004 వరకు అధికారంలో ఉండి తెలంగాణ ఇస్తామని అడుగడుగున మోసం చేసింది మీరు కాదా నిన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ కెసిఆర్ ని విమర్శించారు. అసలు కాంగ్రెస్ అనేదానిని స్వాతంత్రం కోసం ఏర్పాటు చేయడం జరిగింది. స్వాతంత్రానంతరం గాంధీజీ కాంగ్రెస్ ని క్లోజ్ చేయమని చెప్పారు. దాన్ని స్వార్థం కోసం రాజకీయ పార్టీగా మార్చింది మీరు కాదా.. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది అంటున్నారు ఆమె దేవత అంటున్నారు? మరి బ్రిటిష్ వారు స్వాతంత్రం ఇచ్చారు వారు దేవుళ్లా? గాంధీ గారు దేశ జాతిపిత అయితే కేసీఆర్ తెలంగాణ జాతిపిత ఒకవేళ మీరు అన్నట్టు సోనియా గాంధీ దేవత అయితే బ్రిటిష్ వాళ్ళు దేవుళ్ళు కావాలి ఇది మీ విజ్ఞతకే వదిలేస్తున్నా ఎన్నడూ తెలంగాణ అనే పదం గానీ జై తెలంగాణ అనని మీరా మాకు నీతులు చెప్పేది. బీఆర్ఎస్ పార్టీ ఉన్నన్ని రోజులు తెలంగాణ అనే పదం బతికి ఉంటది. అప్పులు అప్పులు అని మాట్లాడుతున్నారు 10 సంవత్సరాల్లో మేము ఎంత అప్పులు చేసిన ఎంత అభివృద్ధి చేసినాము, 15 నెలల కాలంలో మీరు ఎంత అప్పులు చేసిర్రు అభివృద్ధి చేశారు. శ్వేత పత్రం విడుదల చేద్దాం చర్చకు మేము సిద్ధం మీరు సిద్ధమా? మీరు ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు ఎప్పుడు ఎక్కడ పూర్తి చేసిండ్రు 100% ఎక్కడైనా అమలు అయినాయా మండలంలో ఏ గ్రామానికి వెళదాం మీరే చెప్పండి మేము ఎప్పుడు సిద్ధం. కేసిఆర్ ని విమర్శించే స్థాయి మీది కాదు ఖబర్దార్ ఇందులో పాల్గొన్న జిల్లేడు చౌదరిగూడెం మండల బీఆర్ఎస్ నాయకులు, మండల మాజీ మార్కెట్ డైరెక్టర్ రాములు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బాబురావు, పిఎసిఎస్ డైరెక్టర్ జబ్బార్, మాజీ ఎంపిటిసి సభ్యులు సత్య ప్రమోద్, నర్సింగరావు, మానయ్య, యువత అధ్యక్షులు ధీమ గణేష్, బసు నరసింహులు, ఇస్మాయిల్, రాజు, సురేష్, మల్లేష్, శివరాజు, మాల మల్లేష్ బాబాయ్,రామ్ చరణ్, సద్దాం,సత్యం ముదిరాజ్ తదితరులు ఉన్నారు.



## ఘనంగా ముషీరాబాద్ స్పెషల్ ఆర్ఐ మహేష్ జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** ముషీరాబాద్ మండల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ స్పెషల్ ఆర్ఐ జన్మదిన వేడుకలను మంగళవారం కేక్ కట్ చేసి తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ చందన, ఆర్ఐ జ్యోతి, రాము, ప్రణీత్, శివ, వీరేష్, ఫహద్ అల్ హాసన్, జమాలోద్దీన్ శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళ చనిపోతూ ఆరుగురికి ప్రాణదానం..



**జోగులాంబ గద్వాల జిల్లా:** ఉండవెల్లి మండలం.. బొంకూర్ గ్రామానికి చెందిన నర్స బాయ్ అనే మహిళ.. ప్రమాదవ శాత్తు క్రిందపడి చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ గురైన మహిళ.. అవయవ దానానికి ఒప్పుకున్న కుటుంబ సభ్యులు.. అవయవ దానం చేసిన మహిళకు ఘనంగా వీడ్కోలు పలికిన కర్నూల్ లోని కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది..నర్సా బాయ్ అవయలనుఆపదలో ఉన్న ఆరు మందికి దానం.. నర్సా బాయ్ అంతక్రియలకు భారీగా వైకుంఠ వాహానానికి పూలమాలలో అలంకరించిఅంతిమయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న గ్రామస్తులు...

# మల్దకల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**మల్దకల్ :ఏప్రిల్ 29:** జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మల్దకల్ గ్రామానికి నిర్దేశించిన 63 ఇందిరమ్మ ఇండ్ల పరిశీలనలో బాగంగా అట్టి అర్హులైన వారిని గుర్తించడానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి మల్దకల్ ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి మరియు పంచాయితీ సెక్రెటరీ తిరుమలయ్య మరియు మిగతా మండలానికి సంబందించిన గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి శ్రీమతి సంగీతలక్ష్మి గారు మరియు ఎంపీ ఓ రాజశేఖర్ గారు గ్రామపంచాయతీ ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొనడం జరిగింది

# యూనివర్సిటీ ఇన్నోవేషన్ విజేతలను ప్రకటించిన బోయింగ్



**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** యూనివర్సిటీ విద్యా ర్థులు ప్రాథమిక దశలో ఉన్న స్టార్టప్ వాణిజ్యవేత్తలతో కూడిన ఏడు బృందాలు బోయింగ్ యూనివర్సిటీ ఇన్నోవేషన్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్(బిల్డ్) పోటీ నాలుగో ఎడిషన్ 2024-25లో విజేతలుగా నిలిచినట్లు బోయింగ్ ఇండియా అండ్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ థ్రస్ట్ వర్క్స్ డైనెటిక్స్, నెక్సస్ పవర్, ఎక్స్ ట్రీవ్ ఇన్నోవేషన్స్, క్వాలివన్ టెక్నాలజీస్, రాఫా బయోనిక్స్, హైప్రిక్స్ ఏవియేషన్, త్రిశూల్ స్పేస్ జట్లు విజేతలుగా నిలిచాయని తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్, టెక్నాలజీ, సోషల్ ఇంపాక్ట్, సస్టెయినబిలిటీ రంగాల్లో తమ ఆలోచనలను స్పాన్సర్ చేసే ఈ విజేత జట్లకు రూ.10 లక్షల ఆర్థిక గ్రాంట్ లభిస్తుందన్నారు.

# వైద్యానికి ఆర్థిక సహాయం అందజేసిన జయశంకర్ ఫౌండేషన్

**రేగొండ, ఏప్రిల్ 29 :** జయశంకర్ భూపాలపల్లి రేగొండ మండల కేంద్రంలోని పేద కుటుంబానికి చెందిన కూరాకుల వెంకటేష్ మొబైల్ షాప్ లో పని చేసుకుంటూ అతని భార్య పిల్లల్ని పోషించుకుంటున్నాడు ఇటీవల బైక్ పై వెళుతుండగా ప్రమాదవశత్తు కార్ యాక్సిడెంట్ కావడంతో అతనిని వెంటనే హనుమకొండ గార్డెన్ హాస్పిటల్ లో అడ్మిట్ చేయడం జరిగింది పేద కుటుంబం మైన పరిస్థితి లో వారు జయశంకర్ ఫౌండేషన్ వాళ్ళని ఆశ్రయించారు విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ వెంటనే హాస్పిటల్ కి వెళ్లి వారి కుటుంబాన్ని పరమర్శించి వారికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి వెంకటేష్ కి మనోధైర్యాన్ని కల్పించారు. డాక్టర్లతో మాట్లాడి అతనికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు ఫౌండేషన్ రేగొండ మండల ఇన్చార్జి ఆకుల ప్రతాప్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్యాల స్వామి, మరియు తదితర సభ్యులు పాల్గొన్నారు.



# పేదల ఆర్థిక అవసరాలు తీర్చడంలో సిఎంఆర్ఎఫ్ కీలకపాత్ర

● ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య రక్షణ అత్యవసర చికిత్సలకు ఆర్థిక అవసరాలను తీర్చడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చంద్రుగొండ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె ఆయన సిఫారసు ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు చంద్రుగొండ మండల కేంద్రంలోని రైతువేదిక నందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ ప్రజల కష్టాలలో భాగస్వామ్యమై వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడటం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ఓసిల రూపంలో మంజూరు చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో పనిచేస్తున్నారని గతంలో రూ.5 లక్షల పరిమతి ఉన్న ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచి అనేకమంది ప్రాణాలు నిలిచేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అశోక్ కుమార్, తహశీల్దార్ సంధ్యారాణి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో పహల్గాం అమరులకు నివాళులు...





**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** మంగళగిరి సి.కె . కన్వెన్షన్ హాల్ జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అమరులకు నివాళులు కార్యక్రమమునకు ఏపి ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పాల్గొని అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఉగ్రవాద దాడిలో మృతి చెందిన సోమిశెట్టి మధుసూదన్ కుటుంబానికి జనసేన పార్టీ తరపున 50 లక్షలు రూపాయలు విరాళం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల మీద కనికరమవసరం లేదు నిర్దాక్షంగా చంపి వేయాలి. మన దేశానికి సహనము ఎక్కువైపోయింది అతి సహనం కూడ మంచిది కాదుఉగ్రవాదులు కేవలం హిందువులను టార్గెట్ చేసి చంపారు కొంతమంది నాయకులు ఇది మాట్లాడడానికి ఇబ్బంది పడుతున్నారనీ అన్నారు. భారతదేశ ప్రధాని నరేంద్ర మోది పాకిస్తాన్ పై తీసుకుంటున్న నిర్ణయాలకి కుల, మతాల, పార్టీలకు అతీతంగా ఆసరాగా ఉండాలి అన్నారు.కొంతమంది నాయకులు టీవీ డిబేట్లో కూర్చొని పాకిస్తానీ ప్రేమిస్తున్నామన్నారు. మీరు అంతగా ప్రేమిస్తే పాకిస్తానికే వెళ్లిపోవాల్సిందే అని అన్నారు.భారతదేశంలో ఉండాలి అంటే వందేమాతరం పాడాల్సిందే అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాధా రాం రాజలింగం, కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, రాష్ట్ర నాయకులు పాల్గొని అమరులకు నివాళులు అర్పించారు.

# వనపర్తి జిల్లాలో ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యపై జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనికి వినతి

● అందజేసిన స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్



**వనపర్తి :** వనపర్తి పట్టణంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని తో ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించిన వనపర్తి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్‌కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యావ్యవస్థను వ్యాపారం చేస్తూ ప్రైవేటు ఉపాధ్యాయులను ప్రచార కార్యకర్తలుగా ముందస్తు అడ్మిషన్ల కోసం ఇళ్లు తిప్పుతున్న ఎందుకు స్పందించట్లేదని జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రశ్ని0చారు. గ్రాడ్యుయేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిచేసుకుని ఉపాధ్యాయులుగా సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన టీచర్లు మండుటెండలో సైతం కనీసం నైతిక విలువలు పాటించకుండా మహిళలను కూడా చూడకుండా ఇష్టానుసారంగాను అడ్మిషన్లు టార్గెట్లు ఇచ్చి ఉపాధ్యాయుని ఇబ్బందుల గురి చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు ఉపాధ్యా యుల సమస్యల పైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు ఎందుకు స్పందించట్లేదు.ఎలక్షన్స్ సమయంలో ఆత్మీయ సమ్మేళనాలు పేరుతో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. హామీలు దేవుడెరుగు కనీసం మా ఆత్మగౌరవం దెబ్బతింటున్న పట్టించుకునే వాళ్ళు లేరని వారి గోడుడిని ఎల్లపుచ్చుకుంటున్నారు.విద్యావ్యవస్థలో మేము కూడా ఒక భాగమేనని భావితరాన్ని తీర్చితే బాధ్యత మాపై కూడా ఉందని తెలుపుతూ ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాలు బలోపేతం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల పైచిలుకు ప్రైవేటు ఉపాధ్యాయులు ఉన్నారని వారి సమస్య పైన మాట్లాడే నాయకులు లేరు. మేము కూడా ప్రభుత్వ గుర్తింపు పొందినటు వంటి సర్టిఫికెట్లు సాధించి ప్రభుత్వ గుర్తింపు పొందినటువంటి పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉన్నామని కనీసం రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం తో యాజమాన్యాలు ఉపాధ్యాయులపై పని భారం మోపుతున్నాయి. ప్రైవేటు ఉపాధ్యాయులకు మే నెలలో జీతాలు అందజేసే విధంగా ప్రవేట్ యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలపై విద్యార్థి సంఘాల నాయకులు కూడా మద్దతు ప్రకటించాల్సిన భాధ్యత తీసుకోవాలనీ కోరారు. తక్షణమే సంబంధిత మండల విద్యాధికారులకు ఆదేశాలు అందజేస్తామని డీఈవో తెలియజేశారు.

# పాకిస్థాన్ జిందాబాద్ అన్నాడు... అక్కడికక్కటే కొట్టి చంపారు!

● కర్ణాటకలో ఘటన ● మంగళూరులో క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు చేసిన వ్యక్తి ● మూకుమ్మడి దాడి చేసిన కొందరు వ్యక్తులు ● ప్రధాన నిందితుడితో పాటు 10 మందికి పైగా అరెస్ట్




పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ అంటే ప్రజలు ఎలా మండిపడుతున్నారో చెప్పే ఘటన కర్ణాటకలోని మంగళూరులో చోటుచేసుకుంది. స్థానికంగా జరిగిన ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భ ంగా 'పాకిస్తాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశాడన్న కారణంతో ఓ వ్యక్తిపై కొందరు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రధాన నిందితుడితో సహా పది మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ ముమ్మరం చేశారు.మంగళూరు శివార్లలోని కుడుపు గ్రామంలో భట్ర కల్లూర్తి ఆలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. అక్కడ జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో మృతుడికి, సచిన్ అనే మరో వ్యక్తికి మధ్య మొదట వాగ్వాదం చోటుచేసుకుంది. అది తీవ్ర ఘర్షణగా మారి, కొందరు గుంపుగా చేరి బాధితుడిపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి, కాళ్లతో తన్నారు. సాయంత్రం ఆలయ సమీపంలో బాధితుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.ఈ ఘటనను కర్ణాటక హెూం మంత్రి జి. పరమేశ్వర ధృవీకరించారు. క్రికెట్ మ్యాచ్‌లో 'పాకిస్తాన్ జిందాబాద్' అని అరిచినందుకు కొందరు దాడి చేశారని, బాధితుడు తర్వాత మరణించాడని ప్రాథమిక సమాచారం ఉందన్నారు. 10-12 మందిని అరెస్టు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు.మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ మాట్లాడుతూ, పోస్టుమార్టంలో తీవ్ర గాయాల వల్లే మృతి చెందినట్లు నిర్ధారణ అయిందన్నారు. వెన్నుపై పదేపదే కొట్టడం వల్ల అంతర్గత రక్తస్రావం, షాక్‌తో మరణించినట్లు నివేదిక వెల్లడించిందని తెలిపారు. ప్రధాన నిందితుడైన సచిన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది నేరంలో పాల్గొనడంతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కఠిన సెక్షన్లు నమోదు చేశామని, దీని కింద జీవిత ఖైదు లేదా మరణశిక్ష పడే అవకాశం ఉందని వివరించారు. స్థానికుడి ఫిర్యాదు మేరకు 19 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ డేటా ఆధారంగా పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# భూభారతి చట్టంతో రైతులకు మేలు: ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**రాయికల్ ఏప్రిల్ 29:** భూభారతి చట్టంతో ఎంతోమంది రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు,రాయికల్ పట్టణ పద్మశాలి సంఘ భవనం లో నూతన అర్ ఓ అర్ చట్టం 2025 భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమం లో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ,జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు.అనంతరం రాయికల్ పట్టణ,మండలానికి చెందిన లబ్దిదారులకు 60 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 17 లక్షల50వేల రూపాయల విలువగల చెక్కులను,14మందికి కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా మంజూరైన 14 లక్షల రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారుఅంతకుముందు మార్కండేయ దేవాలయం లో స్వామి వారినీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ భూభారతి తో రైతులకు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు.కలెక్టర్ స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించే అవకాశం ఉందని గ్రామ స్థాయిలోనే భూభారతి చట్టం అమలు అయ్యేవిదంగా చూడాలి..అసైన్డ్ భూములు,అటవి భూముల విషయం లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ భూమి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ద్వారా సాదా బైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తుందని , భూ భారతి చట్టం లోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెల్ల కాగితాల పై కొనుగోలు చేసిన సాధా బైనామా భూముల పట్టాలు అందించాలని గత ప్రభుత్వం తీసుకున్న దరఖాస్తుల పరిష్కారం పై ధరణిలో అవకాశం లేనందున హై కోర్టు స్టే విధించిందని, పెండింగ్ సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టం సెక్షన్ 6 క్రింద ఆర్డిఓ లకు బాధ్యతలు అందించిందని అన్నారు.చిన్న సన్న కారు రైతులు 2014 కంటే ముందు కొనుగోలు చేసిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు మాత్రమే సాధా బైనామా పట్టా లభిస్తుందని అన్నారు. గడిచిన 12 ఏళ్ళలో సాధా బైనామా భూముల అనుభవంలో ఉన్న వారికి మాత్రమే దరఖాస్తులు పరిష్కారం అవుతాయని అన్నారు.భూ భారతి చట్టం ద్వారా పక్కగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయ సాయం అందుబాటులో ఉంటుందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్ల పై సంతృప్తి చెందకుంటే బాధితులు అప్పిల్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజుల లోగా మ్యూటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం మార్పులు చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు అందించడం జరుగుతుందని అన్నారు. ఆర్డీవోమధుసూదన్, ఎంపీడీవో చిరంజీవి,ఎమ్మార్వో ఖయ్యుం, పిఎసిఎస్ ఛైర్మెన్ లు ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం,ముత్యం రెడ్డి,రాజిరెడ్డి, ఎంపీవో సుష్మా, ఏఓముక్తేశ్వర్, మోర హనుమండ్లు, కోల శ్రీనివాస్,అచ్యుత్ రావు,రవీందర్ రావు,రవీందర్ రెడ్డి,మోహన్,శ్రీనివాస్ గౌడ్,ముకీద్,అనుపురం శ్రీనివాస్,గంగారెడ్డి,రాయికల్ పట్టణ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# సొమ్ము ఒకరిది - సోకు మరొకరిది

**● వైయస్సార్సీపి ఆర్.టి.ఐ జిల్లా అధ్యక్షులు వెల్లాల రామ కృష్ణారెడ్డి**




**కడప ఏప్రిల్ 29:-** కడప నగరం బుగ్గవంక రక్షణ గోడలపై ఫెన్సింగ్ ఏర్పాటుకు తాము అన్ని చర్యలు తీసుకుంటే ప్రస్తుత ఎమ్మెల్యే మాధవీరెడ్డి దానిని తమ ఘనతగా చెప్పుకోవడం తగదని కడప జిల్లా వైయస్సార్ సిపి ఆర్టిఐ జిల్లా అధ్యక్షులు వెల్లాల రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా కడప నగరంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుగ్గవంక పరిసరాల్లోదుర్వాసన రాకుండా,వంక పూడిపోకుండా ఉండేందుకు తాము బుగ్గవంక బ్రిడ్జిపై నుంచి చెత్తాచెదారాలు, కోళ్ల వ్యర్థాలు, ఇతర పనికి రాని వస్తువులు వేయకూడదని తమ డివిజన్‌కార్పొరేటర్,తాను చొరవ తీసుకుని కార్పొరేషన్‌లో జరిగిన సమావేశంలో ప్రతిపాదనలుపెట్టి నిధుల విడుదలను ఆమోదింపజేసుకోవడం జరిగిందన్నారు.ఇటువంటి తరుణంలో ఎమ్మెల్యే తాను ఏదో ఘన కార్యం చేసినట్లు ఈ విషయంగా ప్రచారం చేసుకోవడం తగదన్నారు.స్థానిక కార్పొరేటర్‌గా,వైసీపీ ఇన్‌ఛార్జి తమ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వైసీపీ హయాంలోనే కడప నగరం అన్ని విధాల అభివృద్ధి చెందగా,దానిని ఎమ్మెల్యే తన వల్లనే అన్ని పనులు జరిగాయని చెప్పుకోవడం తగదని ఆయన వివరించారు.ఈ సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కడప ఆర్ఎం కార్యాలయం ఎదుట రిలే దీక్షలు

**● నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు**



**కడప ఏప్రిల్ 29:-** నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప ఆర్ఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి .రెండవరోజు నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు నాగరాజు,నాగేశ్వరరావులు దీక్షల్లో పాల్గొని తమ నిరసన తెలియజేశారు. మంగళవారం ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళనలు కొనసాగిస్తున్నామన్నారు.తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని,కార్మికుల న్యాయమైన సమస్యలను మాత్రమే పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.ముఖ్యంగా 1/2019 సర్కులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను నిలుపుదల చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలన్నారు. అలాగే జీఓ నెంబరు 114లో పొందుపరిచిన విధంగా నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ. 150%-%400కు పెంచాలని,ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మిశెట్టి చంద్రశేఖర్, యూనియన్ నాయకులు, మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి సన్మానం



**ప్రొద్దుటూరు ఏప్రిల్ 29:-** పరిశుద్ధాత్మ ప్రార్థన మందిరం వారు మంగళవారం మండలంలోని కామనూరు గ్రామంలోని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వగృహంలో కలిసి సత్కరించారు.స్థానిక చిన్న శెట్టిపల్లి బైపాస్ రోడ్డులో పరిశుద్ధాత్మ ప్రార్థన మందిరం వారోత్సవాలు ఈ నెల 25,26,27 తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించాగా, ఈ వారోత్సవ సభలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా సహకరించిన శాసనసభ్యులు నంద్యాల వరద రాజుల రెడ్డి, రూరల్ తాలూకా పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలుపు కుంటూ పరిశుద్ధాత్మ ప్రార్థన మందిరం వారు ఎమ్మెల్యేని శాలువతొ సత్కరించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు బోనం గురివిరెడ్డి, మందిరం సభ్యులు ఆవుల బాలరాజు,పిల్లి లాజరు,గౌసా నవీన్,నరేష్,పాల్గొన్నారు.

## బిసి నాయకుడి కుమారుడిని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరామర్శ

**రాయచోటి ఏప్రిల్ 29:-** వైఎస్ఆర్ సిపి గాలివీడు మండల బిసి సెల్ కన్వీనర్ వల్లపు నగేష్ కుమారుడు వెంకట రమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కడపలోని జగదీష్ న్యూరో కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుచున్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మంగళవారం వెంకట రమణ ను కడపలోని జగదీష్ న్యూరో కేర్ ఆసుపత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు.వైఎస్ఆర్ సిపి స్టేట్ లీగల్ సెల్ కో ఆర్డినేటర్ జల్లా సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు ఉద్యోగులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి

**● జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**రాయచోటి ఏప్రిల్ 29:** పని ప్రదేశంలో ఏర్పడే సమస్యలను "మహిళా ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో" ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు.మంగళవారం రాయచోటి కలెక్టరేట్లో అమరావతి ఏపీజేఏసీ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన " షీ బాక్స్"(ఎస్.హెచ్.ఈ బాక్స్) ను మహిళ ఉద్యోగులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.అనంతరం కలెక్టరేట్ నందలి మినీ వీడియో కాన్ఫరెన్స్ లో మహిళా ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... మహిళల సమస్యలపై " షీ బాక్స్"ను ఏర్పాటు చేయడంశుభపరిణామం. ప్రధానంగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రదేశంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను బయట చెప్పడానికి లేదా లైంగిక వేధింపుల అంశాలలో తమ పేర్లు బయట పెట్టడానికి చాలామంది ఇష్టపడుటలేదు. మహిళలు తమ సమస్యల పరిష్కారం దిశగా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి. ఏదైనా సమస్యపై మహిళలు ఫిర్యాదు చేయడమే కాకుండా వాటిని ఎదుర్కోవడం సమస్యపై ధైర్యంగా నిలబడే విధంగా చైతన్యవంతులు కావాలన్నారు. వాస్తవిక సమాచారం ఆధారాలతో తమ దృష్టికి వచ్చిన ఏ సమస్య నైనా తప్పకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర



ప్రభుత్వం కూడా మహిళా ఉద్యోగుల సంక్షేమంతో పాటు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కలెక్టరేట్లో మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్ల నిర్మాణం కూడా చేపట్టామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.అదేవిధంగా ప్రతి కార్యాలయంలో మహిళలకు విడిగా టాయిలెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సి బాక్సు ను ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా దానిని తగువిధంగా పర్యవేక్షణ చేయాలని, మహిళల్లో అవగాహన పెరిగేందుకు ఏపీ జేఏసీ మహిళా సభ్యులు కృషి చేయాలని పేర్కొన్నారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ..రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న మహిళలు ఏదేని సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చినపుడు వాటి పరిష్కార దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఒక మహిళ ఉద్యోగికి ఏదైనా సమస్య వస్తే తోటి మహిళా ఉద్యోగులు అండగా ఉండాలని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే దిశగా అవగాహన పెంచాలన్నారు.ప్రతి మహిళ ఉద్యోగి షి బాక్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో అమరావతి ఏపీజేఏసి జిల్లా చైర్మన్,రాయచోటి తాసిల్దార్ నరసింహ కుమార్ మరియు జనరల్ సెక్రెటరీ వైష్ణవి మాట్లాడుతూ... మహిళా ఉద్యోగులు కొన్ని సమస్యలను మౌఖికంగా తెలపలేకపోవచ్చు.రాతపూర్వకంగా అర్జీతో అధికారిని కలవాలన్న కొద్దిగా బిడియం మరియు భయపడే పరిస్థితిలో కొంతమంది ఉన్నారు. అలాంటి వారికి భరోసా కల్పిస్తూ వారి సమస్యలు తెలుపుకునే ఒక అవకాశం కల్పించాలని భావనతో రాష్ట్ర ప్రభుత్వం అంగీకారంతో ఏపీ జేఏసీ వారు షీ బాక్సులను ఏర్పాటు చేయాలని సంకల్పించిన మేరకు నేడు కలెక్టరేట్లో బాక్సు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లా నందలి మూడు డివిజన్లో తమ శాఖ సబ్ కమిటీలను ఏర్పాటు చేసుకొని,మహిళా ఉద్యోగులందరూ అన్ చక్కగా పనిచేసుకోవాలని సదుద్దేశంతో సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్ రావు,ఏపీజేఏసీ మహిళా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల మహిళ ఉద్యోగులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బ్యాంకులో అగ్రగామి ఏ.పీ.జి.బి.

**● రూ.50,757 కోట్ల వ్యాపారం**

**● ఒకటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు**

**● ఏపీజీబీ చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్**



**కడప ఏప్రిల్ 29:-** ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రూ.23,667 కోట్ల డిపాజిట్లు,రూ.27,090 కోట్ల రుణాలతో మొత్తం రూ.50,757 కోట్ల వ్యాపారంతో దేశంలోని గ్రామీణ బ్యాంకులలో అగ్రగామిగా ఉందని బ్యాంకు చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్ పేర్కొన్నారు.మంగళవారం మరియాపురం రోడ్డులో ఉన్న బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీబీ 2024-25 ఏడాదికి రూ.639 కోట్ల నికర ఆదాయం అర్జించిందని తెలిపారు.అతి తక్కువ మొండి బకాయిలు కలిగి ఉందని చెప్పారు.బ్యాంకు రాష్ట్రంలోని 10 జిల్లాల పరిధిలోని 56 లక్షల ఖాతాదారులకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. 6,90,538 రైతులకు రూ.8,798 కోట్ల పంట రుణాలు,1,20,653 మహిళా సంఘాల గ్రూపులకు రూ.6,867 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు.అన్ని రకాల ఆధునిక సాంకేతిక సదుపాయాలను బ్యాంకు అందిస్తుందని తెలిపారు. ప్రగతి విద్యా జ్యోతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున 482 మందికి స్కాలర్షిప్స్ అందజేశామని చెప్పారు. భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నంబరు 1625(ఇ) ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్న నాలుగు గ్రామీణ బ్యాంకులు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఒకే ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ గా 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు' గా విలీనం చేయబడుతుందని పేర్కొన్నారు.మే ఒకటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మరింత మెరుగైన సేవలు రాష్ట్రమంతటా అందిస్తుందని తెలిపారు.సమావేశంలో జనరల్ మేనేజర్లు హరికేశ్వర ప్రసాద్,పడిగేటివార్, సంజీవప్ప, రాజేంద్రన్, చీఫ్ మేనేజర్లు, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవాలయ దారి మూసివేసిన వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**● టీడీపీ నేతలకు శ్రీ సత్యసాయి జిల్లా వాసి తిమ్మప్ప ఫిర్యాదు ● వివిధ సమస్యలపై టీడీపీ కేంద్రకార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు**

**మంగళగిరి ఏప్రిల్29:-** శ్రీకృష్ణదేవ రాయలు కాలంనాటి దేవాలయానికి ఉన్న దారిని వైసీపీ నాయకులు మూసి వేయడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని... అయినా దేవాదాయ, రెవెన్యూశాఖల అధికారులుపట్టించు కోవడంలేదని... దయ చేసి ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి వైసీపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం ఛత్రం గ్రామానికి చెందిన తిమ్మప్ప గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.మంగళవారం మంగళగిరి లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కు రాష్ట్ర వ్యాప్తంగా అర్జీదారులు తరలివచ్చారు.వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు,టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ,కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ లు దరఖాస్తులను స్వీకరించారు.వైసీపీ వ్యక్తితో అధికారులు కుమ్మక్కై తన అన్న తనకు రాసి ఇచ్చిన ఎకరం పొలంలో ఎనిమిది సెంట్లను తగ్గించారని.. తగ్గించిన పొలంలో వైసీపీ వ్యక్తి పల్లెం వెంకన్న వాష్ రూమ్స్ కడుతున్నాడని.. దీనిపై ప్రశ్నిస్తే మహిళనని కూడా చూడకుండా అధికారులు తనపైదుర్భాషలా డుతున్నారని.. వారిపై చర్యలు తీసుకొని తన పొలం



ఎకరం ఉండేలా చూడాలని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం శెరిదగ్గుమిల్లి గ్రామానికి చెందిన పల్లెం పద్మజ అర్జీని అందజేసింది. తన భార్య ఆరోగ్యం భాగోలేక ఇంటిని మాత్రం పేతురు అనే వ్యక్తికి అమ్మితే పక్కన ఉన్న స్థలానికి కూడా కాగితాలు పుట్టించి స్థలంలోకి రానివ్వకుండా బెదిస్తున్నాడని కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తెల్లప్రోలు గ్రామానికి చెందిన ప్రభాకర్ రాజు ఫిర్యాదు చేశాడు.గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణంతో పాటు శ్మశాన వాటికలో పెరిగిన చిల్లచెట్లను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం ఎస్. కొత్తపల్లె గ్రామానికి చెందిన చిన్న వెంకటరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.తన కూతురు పుట్టినప్పటి నుండి అంగవైకల్యంతో బాధపడు తుందని..దయ చేసి తన కూతురుకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని నంద్యాల జిల్లా సున్నిపెంటకు చెందిన సయ్యద్ వాజీద్ బాషా గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ అందజేశాడు.తమ గ్రామంలో తాగునీటి సమస్య రోడ్ల సమస్య ఉందని..వెంటనే వాటిని పరిష్కరించాలని ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం ప్రెగళ్లపాడు గ్రామానికి చెందిన మూడ మంచు కొండగురవయ్య గ్రీవెన్స్ లో అర్జీ అందజేశాడు. గత 40 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న భూమిని మరొకరు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొని ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని..ప్రకాశం జిల్లా పామూరు మండలం దాదిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన అబ్బూరి శేషయ్య గ్రీవెన్స్ లో అర్జీ అందజేశాడు.రామ గిరిలో ఉన్న తమ భూములను తన తాత బోయ నరసింహులు అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారని.. %శ్రీ%ఇప్పుడు ఆయన కుమారుడు ఆపొలాన్ని చేసుకుంటూ..గత ఆరు సంవత్సరాలుగా పొలాన్ని ఖాళీ చేయమంటే చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని అనంతపురం జిల్లా పామిడికి చెందిన సర్దార్ బాషా గ్రీవెన్స్ లో అర్జీ అందజేశాడు. బాధితుల వద్ద నుంచి స్వీకరించిన సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు.

## వక్ఫ్ సవరణ చట్టంకు వ్యతిరేకంగా లైట్లు స్విచ్ ఆఫ్ చేసి నిరసన తెలపాలని జేఏసీ పిలుపు



**ప్రొద్దుటూరు ఏప్రిల్ 29:–** వక్ఫ్ సవరణ చట్టం కు వ్యతిరేకంగా లైట్లు స్విచ్ ఆఫ్ చేసి నిరసన తెలపాలని జేఏసీ సభ్యులు షేక్ సలీం, హీదాయతుల్లా, మౌలానా మక్బుల్ అహమ్మద్ కోరారు.మంగళవారం వారు ఈ విషయమై మాట్లాడుతూ..ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు ప్రొద్దుటూరు జేఏసీ ఆధ్వర్యంలో 2025 వక్ఫ్ సవర్ణ చట్టం కేంద్రం వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఏప్రిల్ 30 వ తేదీ రాత్రి 9:00 నుండి 9:15 నిమిషాల వరకు లైట్ స్విచ్ ఆఫ్ చేసి నిరసన వ్యక్తం చేసే కార్యక్రమన్ని పట్టణ ప్రజలు చుట్టూ ప్రాంతాల వారు ప్రజా సంఘాల వారు, లౌకికవాదులు, రాజ్యాంగ పరిరక్షణ వాదులు, కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ రాజ్యాంగ వ్యతిరేకమైన ఈ చట్టాని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తూ మీ గృహాలు, ఆఫీస్, షాప్, ఫ్యాక్టరీ, కంపెనీల లో లైట్ స్విచ్ ఆఫ్ చేసి నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు.

## ఇల్లు దగ్ధం బాధితురాలికి మంత్రి నారా లోకేష్ రూ.15 వేల ఆర్థిక సాయం

**● స్థానిక నాయకుల ద్వారా ఆర్థిక సాయం అందజేయించిన మంత్రి నారా లోకేష్**



**మంగళగిరి ఏప్రిల్ 29:–** మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడి కొత్తపాలెంకు చెందిన షేక్ నన్నిబి ఇల్లు ఈ నెల 25వ తేదీన వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి దగ్ధమైంది.ఈ ఘటనలో ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదై బాధితురాలు కట్టు బట్టలతో ప్రాణాలను దక్కించుకుంది.స్థానిక నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ మంగళవారం స్థానిక నాయకులను బాధితురాలు నన్నిబీ వద్దకు పంపించి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేయించారు.అలాగే ప్రభుత్వం నుంచి నిత్యావసర వస్తువులను అందజేయించారు.ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ బాధితురాలికి కూటమి ప్రభుత్వం తరపున న్యాయం చేస్తామని,కొత్త ఇల్లు మంజూరుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, జనసేన పార్టీ అధ్యక్షులు నడపన దుర్గారావు,సీనియర్ నాయకులు మాదాల రమేష్ బాబు,చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు,యామినేని సుధాకర్,షేక్ అమీర్ బెగ్,షేక్ ఖాసీం,షేక్ షామిరుల్లా,దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## కడుమూరు లక్ష్మీదేవి నేత్రదానం



**పులివెందుల ఏప్రిల్ 29:** పులివెందుల పట్టణం కచేరి రోడ్ లోని నాగయ్య ఆశ్రమంలో నివాసం ఉంటున్న కడుమూరు లక్ష్మీదేవి (50 సంవత్సరాలు) మంగళవారం మరణించడం తో ఆశ్రమం నిర్వాహకులు రమాదేవి, అంధుల ఆశ్రమం నిర్వాహకులు రామ్ మోహన్ ,వెంకటేష్,వెంకటమ్మ, గంగమ్మ లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు లకు సమాచారం ఇవ్వడంతో టెక్నిషియన్ హరీశ్ తో కలిసి అంధుల ఆశ్రమం వెళ్ళి పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపడం జరిగింది. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టి లో కలిసి పోయే నేత్రాలు దానం చేసి అంధత్వంతో బాధ పడుతున్న అంధులకు చూపు ఇచ్చే బృహత్కార్యం కోసం కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన 7093204537 లేదా 9966509364 లకు సమాచారం ఇచ్చి అంధ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకులకు సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## ఆర్.డి.టి సేవా సంస్థపై బురద చల్లొద్దు

**● కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలి**



**ఉరవకొండ ఏప్రిల్ 29:–** అనంతపురం జిల్లాలోని ఆర్.డి.టి సేవా సంస్థ సేవలను పునరుద్ధరించకపోతే జిల్లాలో నిరుద్యోగం తాండవిస్తోందని దళిత సంఘాలు ప్రభుత్వంపై తూర్పారబట్టాయి.కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఫెరా పునరుద్ధరణ విషయంలో బ్రేకులకు తక్షణమే ఉపసంహరించుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మొలక బాల రామాంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దీర్ఘకాలంగా బడుగు బలహీన వర్గాలకు ఎన్నో రకాల సేవలందించిన విన్సెంట్ ఫెర్రర్,అన్నీ ఫెర్రర్ దంపతుల సేవలను మొలక రామాంజనేయులు కొనియాడారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో సంక్షేమ పథకాల అమలులో ఎంతోమంది ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తప్పిదాలకు పాల్పడి ఉండొచ్చు ఏమో గాని, ఎలాంటి అరా మరికలు లేని సేవలందించి అందిస్తున్న ఆర్డిటి సంస్థ పై బురద చల్లితే ఎట్టి పరిస్థితుల్లో తాము ఉపేక్షించబోమని హేచ్చరించారు.ఉద్యోగాలు భర్తీ చేయలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆ సమర్థతను వేలెత్తి చూపారు.ఎందరో నిరుద్యోగులకు ఉపాధి కల్పనా సంస్థగా ఆర్డిటికీ పేరు ఉందన్నారు. విద్య వైద్య రంగాలలో సంస్థ మేలిమి రకమైన సేవలందించి ప్రజల మెప్పు పొందిందని ప్రశంసల జల్లు కురిపించారు.స్వచ్ఛంద సేవా సంస్థ పై కేంద్ర ప్రభుత్వ చర్యలు బురద చల్లని రామాంజనేయులు అభివర్ణించారు.సంస్థ ఫెరా నిబంధనలను ఏనాడూ ఉల్లంఘించలేదని తెలిపారు. ఇలాంటి స్వచ్ఛంద సేవకులకు ప్రతిబంధకాలు సృష్టిస్తే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షులు మొలక బాల రామాంజనేయులు,ఎమ్మార్పీఎస్ నాయకులు రవీంద్రబాబు దళిత నాయకులు శ్యాంప్రసాద్,కోళ్ల ఏసన్న,సల్మాన్ కోళ్ల సుధాకర్ దేవపుత్ర నరసింహులు తదితరులు పాల్గొన్నారు

## రాయలసీమలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పెంచేందుకే ట్రయల్ రన్



**ప్రొద్దుటూరు ఏప్రిల్ 29:–** రాయలసీమ లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకే ప్రొద్దుటూరు లో 100 రోజుల పి 4 ట్రయల్ రన్ ను ప్రారంభిస్తున్నామని జక్కా జ్యోతి ఫుడ్ ప్రాజెక్ట్స్ సీఈఓ జక్కా పెద్దన్న తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో పి 4 విధానాన్ని తమ సంస్థ ద్వారా రాయలసీమ లో 100 రోజుల ట్రయల్ రన్ చేస్తున్నామని,ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా విచ్చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ సహకారంతో తమ వద్ద అందుబాటులో వున్న ఇన్వెస్టర్ల ద్వారా ప్రతి ఊరిలో ఇద్దరికి ఉపాధి,మరో 20 మందికి వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించి, కలెక్టర్ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంస్థ ద్వారా ఉపాధి కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు.కావున నేటి ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో యువత పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జక్కా జ్యోతి ఫుడ్ ప్రాజెక్ట్స్ మేనేజర్ ఆర్.అజయ్,సిఎఫ్ఒ రాజా,సిఓఓ జె. మార్క్ తదితరులు పాల్గొన్నారు.

## మే 2వ తేదీన ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి



**తాడేపల్లి ఏప్రిల్ 29:–**పెనుమాక గ్రామ టీడీపీ కార్యాలయంలో తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షులు పాలెపు వీరేంద్ర నాద్ (బాబి) కూటమి నేతలు సమీక్ష సమావేశం నిర్వహించారు.అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి మే 2న రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారని,ఆ పర్యటనను కూటమి నాయకులు విజయవంతం చేయాలని కొల్లి శేషు గారు, వీరేంద్ర నాద్ పిలుపునిచ్చారు.టీడీపీ కార్యాలయం టీడీపీ,జనసేన,నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జనసమీకరణ,వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కొల్లి శేషు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.గతంలో మోదీ పర్యటనలకు మించి విజయవంతం చేయడానికి కృషి చేయాలని సూచించారు.కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ పర్యనకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మే 2న రాజధాని అమరావతిలో పునః ప్రారంభం కి ప్రతి ఒక్కరు రావాలని గ్రామంలో ఉన్న అన్ని వార్డు ల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించారుఈ కార్యక్రమం లో బూత్ ఇంచార్జి లు, మహిళా అధ్యక్షులు, తెలుగు యువతనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం

**● సుమారు 120 బైక్ సైలెన్సర్స్ ధ్వంసం**

**● స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సైలెన్సర్ల ను సీజ్ చేసిన కర్నూలు ట్రాఫిక్ పోలీసులు**



**కర్నూలు ఏప్రిల్ 29:–**పట్టణంలో అధిక శబ్దాలు చేస్తూ తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్న సైలెన్సర్ల నియంత్రణకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చర్యలు చేపట్టారు. మంగళవారం కర్నూలు పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయం కొండారెడ్డి బురుజు దగ్గర అధిక శబ్దం కలిగించే సుమారు 120 సైలెన్సర్స్ కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేయించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులకు టోపిలు,కూలింగ్ గ్లాసెస్ అందజేశారు.కర్నూలు మెడికవర్ హాస్పిటల్ అసిస్టెంట్ జనరల్ మెనేజర్ ఖాధర్ భాషాకు,కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్ కు జిల్లా ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మీడియా తో మాట్లాడారు.కర్నూలు పట్టణంలో సామాజిక బాధ్యత కలిగిన పబ్లిక్,ప్రవేట్ సంస్థల వారు ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందిస్తున్నారన్నారు.వేసవి కాలం రావడంతో ట్రాఫిక్ పోలీసులకు మెడికవర్ హాస్పిటల్ వారు కూలింగ్ గ్లాసెస్, టోపిలు ఇవ్వడం జరిగిందన్నారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వినియోగించే మూవబుల్ బారి కేడ్స్ ను కెనరా బ్యాంకు వారు కర్నూలు ట్రాఫిక్ పోలీసులకు అందజేశారన్నారు.కర్నూలు నగరంలో కొంతమంది యువకులు వారి యొక్క ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్స్ అమర్చుకుని,అధిక శబ్దం వచ్చే విధంగా డ్రైవ్ చేయడం తో వారి పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 120 బైక్ సైలెన్సర్స్ సీజ్ చేయడం జరిగిందన్నారు.80 డెసిబల్స్ కంటే అధిక శబ్దము చేస్తున్న బైక్ లను సైంటిఫిక్ పద్దతిలో నాయిస్ పొల్యుషన్ సామాగ్రిని ఉపయోగించి పట్టుకున్నామన్నారు. ఇటువంటివి పునరావృతం అయితే ఆ వాహనదారులకు జరిమానాలు కూడా విధిస్తామన్నారు.జరిమానాలు ముఖ్యం కాదని,అధిక శబ్దం చేసే బైక్ సైలెన్సర్స్ అమర్చుకోకూడదని అలాంటివి చేయకూడదని యువకులు పోలీసులకు సహకరించాలన్నారు.వృద్దులకు,రోగులకు,చిన్న పిల్లలకు ఆకస్మికంగా అధిక శబ్దాలు కలుగుజేస్తే వారి ఆరోగ్యం పై చాలా పరిణామాలుంటాయన్నారు.డిజేల అధిక శబ్దం తో కూడా కొంత మంది అకస్మాత్తుగా గుండెపోటుతో చని పోయిన సంఘటనలు చూస్తున్నామన్నారు.అధిక శబ్దం చేసే సైలెన్సర్స్ వాహనదారులకు విక్రయించే షాపుల యజమానులు,వాటిని బిగించే మెకానిక్ ల పై కూడా దాడులు నిర్వహించి,చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్,కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కర్నూలు ఒన్ టౌన్ సిఐ రామయ్యనాయుడు,కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజారావు,ఆర్ ఐ నారాయణ,ట్రాఫిక్ ఆర్ ఎస్సై హుస్సేన్, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

## ఉపా కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**రామాపురం ఏప్రిల్ 29:–** మండలంలోని నీలకంఠరావుపేటలో ఉపాధి పనులు చేస్తున్న 320 మంది కూలీ లకు మంగళవారం ఎండలు అధికంగా ఉండడంతో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి నీలకంఠరావుపేట ఉప సర్పంచ్ ఎస్ మహ బూబ్ బాషా, ఫీల్డ్ అసిస్టెంట్ పెంచల్ రెడ్డితో కలిసి మజ్జిగ ప్యాకెటలు పంపిణీ చేశారు. కూలీలు ఉప సర్పంచ్ మహబూ బాషాకుపెంచల్‌రెడ్డిలకుఉపాధికూలీలుకృతజ్ఞతలు తెలియజేశారు

## ఆర్డిటి సేవలు పునరుద్ధరించాలి



**దేవనకొండ ఏప్రిల్ 29:–** నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటూ వారి విద్యుత్ వైశానికి ఎంతో తోడ్పాటిస్తున్న ఆర్.డి.టి సంస్థ పై కేంద్రం ఆంక్షలు విధించడం సరైన పద్ధతి కాదని,వాటి సేవలు పునరుద్ధరించాలని సిపిఐ నాయకులు నరసారావు అన్నారు.మంగళవారం కర్నూలు జిల్లా దేవనకొండ లో కేంద్రం ఆర్డిటి సేవలపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నరసారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద విద్యార్థులకు విద్య అభ్యున్నతి కోసం ఆర్డిటి ఎంతో తోడ్పాటు అందించి వారిని చదివిస్తుందని అన్నారు. అలాంటి స్వచ్ఛంద సేవ అందించే ఆర్డిటి సంస్థ పై కేంద్రం ఆంక్షలు విధించడం సరైనది కాదన్నారు.వెంటనే ఆంక్షలు ఎత్తివేసి నిరుపేద విద్యార్థుల చదువుకు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఆసుపత్రిలో శిక్షిత పొంది ఇంటికి వచ్చిన....

**- సర్పంచ్ జరుగు నారాయణరెడ్డిని పరామర్శించిన వైసిపి అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు**



**ఓబులవారిపల్లి ఏప్రిల్ 29:–** ఓలార్ పల్లి మండలం ఎల్లయిపల్లి సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి ఇటీవల అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో శిక్షిస్తా పొంది తిరిగి ఇంటికి వచ్చిన సమయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు మరి కొంతమంది నాయకులు ఆయన స్వగృహం నందు ఆయన ఆరోగ్య పరిస్థితు లు తెలుసుకొని పరామర్శించారు అన్ని విధాల పార్టీకి శ్రేయోభిలాషిగా పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆయన ఆరోగ్యం గా ఉంది త్వరగా కోలుకోవాలని.. భగవంతుని కోరుతున్నామన్నారు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థినిల కుటుంబాలని ప్రభుత్వం ఆదుకోవాలి

**జోగులంబ గద్వాల:** నర్సింగ్ విద్యార్థినిల కుటుంబాలను ఆదుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేసిన.గద్వాల శాసన సభ్యులు బండ్ల క్రిష్ణ మోహన్ రెడ్డి గౌరవ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా కి మరియు జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు కి సంఘటన విషయాలను ఫోన్లో వివరించి కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరిన శాసన సభ్యులు బండ్ల క్రిష్ణ మోహన్ రెడ్డి గల కారణాలను విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. జి ఓ ఎం ఎస్ ఎన్ గద్వాల పట్టణంలోని నర్సింగ్ విద్యార్థినీలు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థినిలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఎమ్మెల్యే హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదాన్ని వెంటనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఫోన్ ద్వారా సంఘటనకు సంబందించిన వివరాలను వివరించారు. విద్యార్థినీల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా స్పందించిన గౌరవ ముఖ్యమంత్రి మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని, అలాగే మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు.



# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

**పులివెందుల ఏప్రిల్ 29:**–రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఎస్ఎంఎస్ జిఎం శ్రీనివాసరావు సీనియర్ మేనేజర్ రామకృష్ణ డిజిఎం రాములు అన్నారు. మంగళవారం తుమ్మలపల్లి ఎస్ఎంఎస్ క్వార్టర్స్ లో రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు.వారు మాట్లాడుతూ ఎస్ఎంఎస్ కంపెనీ మాజీ చైర్మన్ అభయ్ సన్ చీటీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సౌదాగర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో సుమారు వందమంది కార్మికులు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందన్నారు రక్తదానంపై ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దన్నారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల మన ఆరోగ్యంతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందన్నారు అందువల్ల ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్ కుమార్ అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ సీట్లు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన వ్యక్తులు అరెస్ట్



**మేడ్చల్, ఏప్రిల్ 29:**– రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు సంబంధించి మరిపెడ, మహబూబాబాద్, బానోత్ రవి, ఎల్ బి నగర్ కు చెందిన తేజావత్ మంగిలాల్ వ్యక్తులు పీర్జాదిగూడ కు చెందిన మాచర్ల రాము, బాగు స్వామి, చిర్రగోనె నరేష్ వాళ్ళ కుమారులకు మేనేజ్ మెంట్ కోటాలో ఇంజనీరింగ్ సీట్ లు ఇప్పిస్తామని నమ్మించి, ఫేక్ ప్రొవిజనల్ అలాట్ మెంట్ ఆర్డర్ లను తయారు చేసి వాటిని నిజమైన ప్రొవిజనల్ అలాట్ మెంట్ ఆర్డర్ గా వారికి చూపించి నమ్మించాడు. సుమారు 6.5 లక్షల రూపాయలు తీసుకోగా, మాచర్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సోమవారం నాడు ఉదయం 10.00 గంటల సమయంలో పీర్జాదిగూడ కమాన్ దగ్గర ఉన్న బానోత్ రవి, తేజావత్ మంగిలాల్ అను వ్యక్తులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించడం జరిగినది.వీరికి సహాయం చేసిన సత్యనారాయణ పరారీలోఉన్నాడని సీఐ గోవింద్ రెడ్డి తెలిపారు.

## గౌడ కులస్తుల సహకారంతో శ్రీ వైద్య పౌండేషన్ ఉచిత వైద్య శిబిరం

**ముత్తారం : ఏప్రిల్ 29:**–మండలంలోని ఓడేడు గ్రామంలో కంటి కి టార్చ్ లైట్ ఎగ్జామినేషన్ అధునాథ ఆటో రిఫ్రాక్టమీటర్ తో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలు పటేల్ ఐ కేర్ మంథని వ్యవస్థాపకులు బుధ్ధార్థి సతీష్ కుమార్ సౌజన్యంతో, కేటరాక్ట్, తెరిజియం రెటీనా, కార్నియా, స్విoట్, గ్లకోమా, అబ్లియోపియా మరియు మయోపియా, హైపర్ మెట్రోపియా ప్రెస్ బయోపి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించడం జరిగింది. మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత గుండె సంబంధం ( ఇ సి జి), బీపీ, బ్లడ్ ప్రెస్సర్, మధుమేహ పరీక్షలు బ్లడ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. దాసరి చంద్రమౌళి మాట్లాడుతూ పటేల్ ఐ కేర్ మరియు మెడికవర్ హాస్పిటల్ వారికి గ్రామ గౌడ సంఘం తరపున మరియు ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హాస్పిటల్ వారిని అభినందించారు.పటేల్ ఐ మంథని వ్యవస్థాపకులు బుధ్ధార్థి సతీష్ కుమార్. లింగంపేట కృష్ణ చారి స్వచ్ఛందంగా పటేల్ ఐ కేర్ వాలంటరీగా విధిలో పాల్గొన్నారు డా, అక్షిత్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ ,కో ఆర్డినేటర్ శ్రీకాంత్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ మెడికల్ బృందం అల్లాడి యాదగిరిరావు, చీరాల వెంకటేష్, గౌడిశెట్టి సత్తయ్య,సన్నీ, బొంగోని హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- తదుపరి మెరుగైన చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు ఏప్రిల్ 29:**– కర్నూలు నగరంలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మున్సిపల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలపై మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు నగరం లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పారిశుధ్యానికి సంబంధించి గతంలో చెత్త సేకరణ విధానం అమలు చేస్తున్న ఏజెన్సీ ముందుకు రాలేదని మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ కి వివరించగా,నగరంలో చెత్త సేకరణకు ప్రత్యామ్నాయ విధానాన్ని అమలు చేసేలా ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయాలని కోరుతామన్నారు.దీంతో పాటు గతంలో చెత్త సేకరణ చేసే 91 మంది ఆటో డ్రైవర్లకు లోన్ ద్వారా ఆటో లు ఇప్పించే విధంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తో మాట్లాడాలని కలెక్టర్ సూచించారు.తద్వారా వారికి ఉపాధి అవకాశం కల్పించడంతో పాటు నగరంలో పారిశుధ్యం కూడా మెరుగవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఏప్రిల్ 15 వ తేదీ నాటికి అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లలో నీరు సమృద్ధిగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని,కాబట్టి నగరంలో నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు..అదే విధంగా మరమ్మతులు అవసరమైన హ్యాండ్ బోర్ వెల్స్ కు వెంటనే మరమ్మతులు చేయించాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.నగరంలో త్రాగునీటి సరఫరా,పారిశుధ్యం సక్రమంగా అమలు చేస్తేనే మంచి పేరు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.జనరల్ ఫండ్స్,నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం,స్మార్ట్ సిటీ కార్పొరేషన్,ఐఐఐటి డిఎమ్,అమృత్ పథకాల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా డ్రోన్ ల ద్వారా హంద్రీ నదిలో తదితర ప్రదేశాల్లో మలేరియా ఆయిల్ స్ప్రే చేయించడం వంటి చర్యలను ప్రతి సంవత్సరం క్రమం తప్పకు ండా చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.ఎన్ని కిలోమీటర్లు చేశారు? ఎంత ఖర్చు పెట్టారు అనే వివ రాలు కూడా డాక్యుమెంటేషన్ రూపంలో సిద్ధం చేయాలన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధి ంచి వివిధ విభాగాల అధికారులపై వ్యతిరేక వార్తలు వస్తున్నాయని, జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బందితో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి అధికారులు సక్రమంగా పని చేసేలా చూడాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.సమావేశంలో కర్నూలు నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్,ఎంహెచ్ఓ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్,ఏఈ లు,మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



**కడప టౌన్ ఏప్రిల్ 29 :** – జిల్లాలో మే 4న నీట్ యూజీ– 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు రూమ్ హాలు లో నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నీట్ యూజీ అధికారులు,విద్యా శాఖా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిమాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రొద్దుటూరులో రెండు పరీక్ష కేంద్రాలు, కడప జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.ఈ పరీక్షల్లో మొత్తం 2428 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్ లైన్లో విధానంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు.పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుబడ్డ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు.కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను సూపరింటెండెంట్లు, పోలీసు సహకారంతో తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పోలీసు సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు ఆదేశించారు.దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.నీట్ యూజీ నియమ నిబంధనలను తప్పక పాటించాలని అధికారులను ఆదేశించారు.పరీక్షలకు హాజరగు అభ్యర్దులు సెల్ ఫోన్, లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేవని తెలిపారు.పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మౌలిక వసతులైన టాయిలెట్స్, త్రాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు.పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్.టి.సి బస్సులు తగు విధంగా ఉదయము సాయంత్ర వేళల్లో అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.ప్రతి పరీక్ష కేంద్రంలో ఏఎన్ఎం, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద క్రౌడ్ గుమి కూడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.పరీక్ష కేంద్రము సమీపంలో ఎక్కడ కూడా జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.**ప్రొద్దుటూరు పరిధిలో రెండు పరీక్ష కేంద్రాలు** 1.అనిబిసెంట్ మున్సిపల్ హై స్కూల్, (మెయిన్), టి.బి రోడ్ ప్రొద్దుటూరు 2.వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ యోగి వేమన యూనివర్సిటీ, కొర్రపాడు రోడ్డు, ప్రొద్దుటూరు**కడప నగర పరిధిలో ఆరు పరీక్ష కేంద్రాలు..** 1. ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, నాగరాజు పేట, కడప 2. ప్రభుత్వ జూనియర్ కళాశాల, (గర్ల్స్) హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా కడప 3. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎం సి హెచ్ ఎస్ మెయిన్స్,అన్నమయ్య సర్కిల్ దగ్గర కడప 4. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, కడప5. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం,చిన్న చౌక్, కడప 6. వై ఆర్ జెడ్పిహెచ్ స్కూల్ (గర్ల్స్), జడ్పీహెచ్ఎస్ కాలనీ, చిన్నచౌక్,కడపఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్ ,కడప కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ నీట్ సిటీ కోఆర్డినేటర్ మునిష్ మీనా, నీట్ ప్రొద్దుటూరు సిటీ కోఆర్డినేటర్ గంగయ్య, నీట్ యూజీ నోడల్ అధికారులు, ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు, ,ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ పంపిణీలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- పంపిణీ అధికారులను హెచ్చరించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు ఏప్రిల్ 29:**– ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా,మంచి ప్రవర్తన తో మెలగాలని,పింఛన్ పంపిణీ లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పింఛన్ పంపిణీ అధికారులను హెచ్చరించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పెన్షన్ పంపిణీ పై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పెన్షన్ పంపిణీ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పింఛన్ అందించిన అధికారి ప్రవర్తన ఎలా ఉంది, మీరు పింఛన్ తీసుకునేటప్పుడు ఏదైనా అవినీతిని గమనించారా అని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేయించడం జరిగిందని,ఇందులో గత 3,4 నెలల్లో ఎక్కువ ఫిర్యాదులు వచ్చిన పెన్షన్ పంపిణీ అధికారులను సమావేశానికి పిలిచామని తెలిపారు.4000 మంది పెన్షన్ పంపిణీ అధికారులకు గాను 32 మందిపై మూడు సార్లు కంటే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.ఇకపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని, పెన్షన్ పంపిణీ చేసే అధికారులు జాగ్రత్తగా పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల కోసం మనం పని చేస్తున్నామని,ప్రజలు ఇచ్చే డబ్బుతోనే మనకు ప్రభుత్వం వేతనాలు ఇస్తుందని,కాబట్టి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ హితవు పలికారు.పెన్షన్ లబ్ధిదారులతో మర్యాదగా మాట్లాడాలని,మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు.ఐదు మంది సిబ్బంది మీద అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ప్రభుత్వం పేదలకు నెలకు 4000 రూపాయలు ఇస్తే అందులో నుంచి డబ్బు తీసుకోవడం చాలా ఘోరమైన పని అని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.ఈ ఐదుగురి మీద విచారణ చేయాలని,డిఆర్ డి ఎ పిడి ని ఆదేశిస్తూ,అవినీతికి పాల్పడినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.ఫిర్యాదులు ఎందుకు వచ్చాయని పెన్షన్ పంపిణీ అధికారులతో కలెక్టర్ ఆరా తీశారు..కొన్ని సమస్యల గురించి వారు వివరించగా,పెన్షన్ పంపిణీ సమయంలో మీకు వస్తున్న ఇబ్బందులను ఎంపీడీవోలకు వ్రాతపూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.పెన్షన్ పంపిణీ సందర్భంగా గ్రామాల్లో ఆయా ప్రదేశాలకు టైమ్ స్లాట్ కేటాయించి, వారికి ముందే సమాచారం ఇచ్చి ఆ సమయానికి అక్కడికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఎన్ఆర్ఈజీఎస్,వ్యవసాయ పనులకు వెళ్లే శ్రామికులకు ముందుగానే పెన్షన్ ఇచ్చే సమయాన్ని వారికి తెలియజేసి,వారికి పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు.అంతకుముందు జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి,డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారెడ్డి లు మాట్లాడుతూ..జిల్లాలో దాదాపు 2 లక్షల 38 వేల పెన్షన్లను ప్రతినెల పంపిణీ చేస్తున్నామని,ఇందులో ఎటువంటి అవినీతికి అవకాశం లేకుండా పంపిణీ చేయాలని,ప్రజల మనసు గెలుచుకునే విధంగా పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు.సమావేశంలో డిఆర్డిఏ పిడి రమణారెడ్డి,జెడ్పిసిఈఓ నాసర రెడ్డి,ఫిర్యాదులు వచ్చిన పెన్షన్ పంపిణీ అధికారులు పాల్గొన్నారు.

# యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు: కంది వరుణ్ కుమార్ యాదవ్

**కర్నూలు ఏప్రిల్ 29:**– ఉమ్మడి కర్నూలు జిల్లాలో యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు యాదవ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు కంది వరుణ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం యాదవ చైతన్య వేదిక జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జ్యోతిష్య యాదవ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కంది వరుణ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024– 25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసించి పదవ తరగతి ఫలితాల్లో 450 మార్కుల పైన సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యనభ్యసించి 800కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ ఆధార్, మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను మే 20వ తేదీ లోగా యాదవ చైతన్య వేదిక కార్యాలయం, షాప్ నెంబర్ 224, సెకండ్ ఫ్లోర్ జగదీష్ మాల్, బిర్లా కాంపౌండ్, కర్నూలు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రతిభా పురస్కారాలను మే 25వ తేదీన ముత్తుకూరు గౌడప్ప, గోసాయి వెంకన్న ప్రాంగణం (జిల్లా పరిషత్ సమావేశ కార్యాలయం, జడ్పీ హాల్ రాజ్ విహార్,కర్నూలు) లో అందజేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభా పురస్కారాలను అందజేసేందుకు యాదవ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ తో పాటు, వివిధ కార్పొరేషన్లకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన చైర్మన్లు రానున్నారని తెలిపారు. మరిన్ని వివరాలకు జ్యోతిష్య యాదవ్ 965218 7025, మహేష్ యాదవ్ 9494194102,మధుయాదవ్ నందికొట్కూరు 9963323039, రమేష్ యాదవ్ 8106150744, శ్రీను యాదవ్ (%చీ.ా.ఖ.×%) 89199351311, ఈశ్వర్ యాదవ్ 9493388706, శివకృష్ణ యాదవ్ 9000918712, వేణు యాదవ్ 852309780 లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ప్రతి యాదవ సోదర, సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జోహారపురం వెంకట రాముడు యాదవ్, రమేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, గిరి యాదవ్, వెంకట రాముడు యాదవ్, ఈశ్వర్ యాదవ్, రమణ యాదవ్, వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# పాక్‌ను కోలుకోకుండా దెబ్బకొట్టాలి !



ముల్లును ముల్లుతోనే తీయాలి. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్లుగా ఉండాలి. పాక్ ఏర్పడడమే మత ఛాందసవాందతో ఏర్పడింది. తాము భారత్‌ను చీల్చి ఏర్పడ్డామన్న జ్ఞానం వారిలో లేదు. అలాగే భారత్ భిక్షతో దేశంగా ఏర్పడ్డామన్న కృతజ్ఞత బంగ్లాదేశీయులకు లేదు. ఈ రెండు దేశాల్లో మిగిలిన అరకొర హిందువులను తన్ని తరిమేయడం..కశ్మీర్ సహా భారత్‌లో చిచ్చుపెట్టడం వీరి లక్ష్యంగా ఉంది. అది ఎప్పుడో రుజువయ్యింది. మనం శాంతి వచనాలు పలుకుతూ పోతే సమస్య పరిష్కారంకాదు. భారత్‌తో పెట్టుకుంటే అంతే సంగతులు అన్న విధంగా మన జవాబు ఉండాలి. రష్యా ఉక్రెయిన్‌పై దాడిచేసింది. ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉంది. ఇలాంటి దెబ్బలు మనం కూడా కొట్టగలగాలి. నష్టం కలిగినా ఫర్వాలేదు. దేశాన్ని పటిష్టం చేసే క్రమంలో మనమంతా త్యాగాలకు సిద్ధపడాలి. ఈ దేశాన్ని వందలాది ఏళ్లుగా ఎందరో దాడులు చేసి ధ్వంసం చేశారు. మనలను బానిసలుగా మార్చారు. ఇవన్నీ మనకు గుణపాఠం కావాలి. ఇంకా దాడులను తట్టుకుంటూ పోదాం అన్న పద్దతి మాత్రం మంచిది కాదు. పహల్గాం దాడి జరిగి వారం రోజులు అవుతోంది. పాక్ నుంచి శిక్షణ పొందిన ముష్కరులే దాడికి కారణమని తేలింది. ముంబై దాడులు కావచ్చు..పుల్వామా దాడి కావచ్చు...పహల్గామ్ కావచ్చు.. అన్నీ పాక్ కుతంత్రాల వల్లనే జరిగిన ఘటనలు. అయినా దాయాది దేశానికి బుద్ది రావడం లేదు. పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హాషిమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. దీనిని బట్టి పాక్ సైన్యంలో పనిచేసిన వారు ఆ తరవాత ఎలా ఉగ్రవాదులుగా మారుతున్నారో గమనించాలి. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు- పేర్కొన్నాయి. ఇప్పటికే భారత సైన్యం ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో వందల మంది స్థానికులను అదుపులోకి తీసుకొంది. వీరిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్, మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీకరించారని అధికారులు వెల్లడించారు. అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోందని సైన్యం ధృవీకరించింది. ఇంతకన్నా ఆధారాలు ఇక అవసరం లేదు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తేసిన తరవాత అక్కడ శాంతి నెలకొనడమే గాకుండా స్థానికులకు ఉపాధి దక్కుతోంది. పర్యాటకం పెరిగింది. అక్కడి యువతలో కూడా మార్పు వచ్చింది. వారంతా జనజీవన స్రవంతిలో కలిసి పోతున్నారు. దీనిని విచ్ఛిన్నం చేసే పన్నాగమే ఉగ్రదాడి అని తేలింది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘటన అమానవీయమైనదే కాదు.... మనిషన్నవాడు చేసే పని కాదు. ఇది కేవలం రాక్షస జాతి మాత్రమే చేస్తుంది. పాక్ పెంచి పోషిస్తున్న రాక్షసులు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకుమనం కూడా సన్నద్ధం కావాలి. మరణించిన వారి ఆత్మకు శాంతి జరగాలి. ఉగ్రమూకలను చీల్చి చెండాడం ద్వారా మన సత్తా చాటాలి. అలాగే కాశ్మీర్‌లో ఉంటూ...ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న కొందరు పాక్ సానుభూతిపరులను కూడా గుర్తించి కఠినంగా శిక్షించాలి. వారిని కూడా ఉగ్రదాడులకు బాధ్యులను చేయాలి. భూతల స్వర్గంగా భావిస్తున్న కశ్మీర్‌ను చూడాలని వెళ్లిన పర్యాటకులను హతమార్చిన ఘటనను ఇప్పటికీ భారతీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నరమేధాన్ని ప్రపంచ దేశాలు అన్నీ తీవ్రంగా నిరసించాయి. కేంద్ర ప్రభుత్వం ఇందుకు తగిన విధంగానే ప్రతిస్పందించింది. ఈ దుర్ఘటనకు కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్‌ఎఫ్)ను, దానికి సహకారం అందించిన లష్కర్ ఎ తోయిబాను, దీనికి వెన్నుదన్నుగా ఉన్నదను కుంటున్న పాకిస్థాన్‌ను లక్షంగా చేసుకొని తక్షణ చర్యలు చేపట్టింది. తక్షణమే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేయడం, నీటి ఒప్పందాలను వెనక్కు తీసుకోవడంతోపాటు ఇంకా అనేక చర్యలు చేపట్టింది. సరిహద్దులను మూసివేయడం కూడా వెంటనే అమలు చేశారు. అదే విధంగా దాడికి బాధ్యులైన వారి లక్షంగా గాలింపు ముమ్మరం చేశారు. ఇవన్నీ ఊహించినవే అయినా సరిపోవని గుర్తించాలి. ప్రజల్లో వస్తున్న తీవ్ర నిరసన కారణంగా దాడులకు తక్షణ చర్యలు ఉండాలి. ఇప్పటికే కాశ్మీర్‌లో వేలాదిమంది పౌరులు, సైనికులు నేలకొరిగారు. వేలాదిమందిని హత్యలు చేశాలరు. లక్షల మందిని మత మార్పిళ్లు చేశారు. ఇవన్నీ గమనించిన తరవాతనే కేంద్రం 2019లో 370 ఆర్టికల్ రద్దు చేసి కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని ఎత్తేసింది. దీంతో సాధారణస్థితికి వచ్చి కాశ్మీర్ పర్యాటకంగా మళ్లీ చిగురించింది. దీనిని జీర్ణించుకోలేని పాక్ పాపాల భైరవులు దాడులకు తెగించారు. ఈ క్రమంలో అసవరమైతే యుద్ధం దాకా కూడా భారత ప్రభుత్వం వెళ్లవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇక పాక్‌ను ఎంతమాత్రం నమ్మరాదు. పాముకు పాలుపోసి పెంచినట్లుగా మన గత పాలకులు పాక్ పాలకులకు చేయూతను ఇచ్చారు. అందువల్ల మనం ఎంతమాత్రం ఉపేక్షించరాదు. కష్టమైనా, నష్టమైనా దేశాన్ని ఏకతాటిపైకి తీసుకుని రావాలి. రాజకీయపార్టీలు కూడా విభేదాలు పక్కన పెట్టి పాక్‌కు గుణపాఠం చెప్పే ప్రయత్నాలకు బేషరతు మద్దతు పలకాలి. అలాగే పాక్ ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా ప్రతీకార చర్యలు ఉండాలి. అప్పుడే భారత్‌కు శాంతి. గత కొన్నేళ్లుగా మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరుతుంది.



# పహల్గాం దాడిపై పార్లమెంటులో చర్చిద్దాం

- సభలను అత్యవసరంగా సమావేశ పర్చండి
- మోడీకి కాంగ్రెస్ అగ్రనేతల లేఖ



**న్యూఢిల్లీ,ఏప్రిల్29:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం ఎల్లప్పుడూ కలిసి నిలబడతామని చూపించాలని లేఖలో రాహుల్ కోరారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భారత పార్లమెంటు సాక్షిగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని లేఖలో తెలిపారు. కాగా.. పహల్గామ్ దాడి జరిగిన వెంటనే తర్వాతి రోజు సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం కూడా చేశారు. భారత ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తాము మద్దతుగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ- సమావేశం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత జరిగిన అఖిల పక్ష సమావేశానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు- అన్ని పార్టీల నేతలు హాజరయ్యారు. ఆ సమావేశంలో భారత ప్రభుత్వం చేపట్టే చర్యలన్నింటికీ మద్దతుగా ఉంటామని, వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. అయితే ఆ సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకాకపోవడాన్ని మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. టు-వంటి ముఖ్యమైన సమావేశానికి ప్రధాని మోదీ వచ్చి అక్కడ జరిగిన సంఘటనలను వివరించి ఉంటే బాగుండేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ పార్లమెంటు- సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీఎంసీ నేత సుధీప్ బందోపాధ్యాయ, ఆప్ నేత సంజయ్ సింగ్ కూడా ఈ దాడి ఘటన భద్రతా లోపాలను చూపిస్తోందని.. ఈ క్రమంలో భద్రతా లోపాలు ఎందుకు జరిగాయి.. వాటిని ఏ విధంగా సరిచేస్తున్నారు అనే దానిపై ప్రధాని మోదీ జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఉగ్రవాదంపై దేశం ఏకమైందని.. ప్రపంచానికి సందేశం ఇవ్వడానికి పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లేఖలో కోరారు. ఉగ్రవాద దాడుల ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కోవడానికి సమిష్టి సంకల్పాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.అయితే బైసరన్ లోయ తెరిచిన విషయం తమకు తెలియదని కేంద్రం తెలిపింది. ఇది కచ్చితంగా భద్రతా వైఫల్యమేనని ఎంపీ సుప్రియా సూలే పేర్కొన్నారు.

# నేడు అక్షయ తృతీయ పుణ్యతిథి

**- శుభకార్యాలకు మంచిదని పండితుల ఉవాచ**

**తిరుమల,ఏప్రిల్29:** అక్షయమంటే క్షయం కానిది. ఈ రోజు అంటే బుధవారం అక్షయ తృతీయ హిందువులకు చాలా ప్రత్యేకమైన, పవిత్రమైన రోజు. ఈ పండుగను ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో శుక్ల పక్షం మూడో రోజు వస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న వచ్చింది.అక్షయ తృతీయ రోజున వివాహం, గృహప్రవేశం, కొత్త వ్యాపారం లాంటి శుభ కార్యక్రమాలు ప్రారంభించడానికి, దానధర్మాలు చేయడానికి ఉత్తమమైనదిగా పరిగణిస్తాయ. అక్షతయ తృతీయరోజున చేసే అన్ని మంచి పనులు శాశ్వత ప్రభావాన్ని చూపుతాయి. పురాణాల ప్రకారం ఈ రోజునే శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవిని పెళ్లాడాడని ప్రతీతి. పరమశివుడు కుబేరుడిని సంపదలకు సంరక్షకుడిగా నియమించాడు. ఇక, అక్షయ తృతీయ రోజు కేవలం మతపరంగానే ముఖ్యమైనది కాదు. జీవితంలో ఆనందం, శ్రేయస్సు, విజయాన్ని పొందడానికి గొప్ప అవకాశాన్ని కూడా ఇస్తుం దని పండితులు చెబుతారు. అయితే, లక్ష్మీదేవి కటాక్షం దక్కాలంటే ఆమెకు ఇష్టమైన మంచి పనులనే చేయాలి. అక్షయ తృతీయ నాడు విష్ణువు, లక్ష్మి దేవికి ఆచారం ప్రకారం పూజించాలి. అక్షయ తృతీయ రోజున చేసే దానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఆహారం, బట్టలు, బంగారం, ఆవు, గొడుగు మొదలైన వాటిని దానం చేస్తే చాలా శుభప్రదం అంటారు. చేపట్టిన పనులు విజయవంతమై ఫలవంతమైనదిగా జీవితంలో ఆనందం, శ్రేయస్సు పెరుగుతుందని నమ్ముతారు. అక్షయ తృతీయ రోజున ఏదైనా కొత్త పని చేయడాన్ని శుభప్రదంగా భావిస్తారు. కొత్తగా ఆస్తి లేదా ఇంకేదైనా కొనేందుకు, ఎక్కడైనా పెట్టుబడి పెట్టేందుకు అక్షయ తృతీయ అనుకూలమైన రోజుగా భావిస్తారు.ఈ రోజున బంగారం, వెండి, వాహనం, ఇల్లు లేదా భూమిని కొంటే శుభం కలిగి అదృష్టం నడిచొస్తుందని భావిస్తారు. అందుకే అక్షయ తృతీయ రోజు బంగారం కొనడం ఓ సెటిమెంట్‌గా భావిస్తారు.



# అడ్డూఆపూ లేని అవినీతి!



అవినీతిపై ప్రభుత్వాల పోరాటం ఎప్పుడు మొదలైందో తెలియదు గానీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా, ఆ పోరాటం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పుట్టలకొద్దీ వెలుగుచూస్తున్న అవినీతిపరుల బాగోతాన్ని చూస్తుంటే, మన నేతల చేతలు మాటలకే పరిమితమవుతున్నాయని అనిపించకమానదు. పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కుతున్న అవినీతిపరుల నిర్వాకాన్ని చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మొన్నటికి మొన్న వందకోట్ల అవినీతి తిమింగలాన్ని అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసిందన్న వార్త తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పర్యవేక్షించిన ఓ ఉన్నతాధికారిపై ఎసిబి జరిపిన దాడుల్లో దాదాపు వంద కోట్ల రూపాయల విలువైన అక్రమాస్తులు బయట పడ్డాయి. సదరు మహాశయుడు భారీయెత్తున పొలాలు, విల్లాలు, నగానట్రా సమకూర్చుకున్నట్లు వెల్లడైంది. సోదాలు ఇంకా జరుగుతున్నందున ఈ ఆస్తుల విలువ ఎంతకు చేరుతుందో అంచనా వేయలేం.ఈ కేసులో నిజానిజాలు ఎలా ఉన్నా, పత్రికల్లో వచ్చిన ఈ వ్యవహారాన్ని చూసి, ఈ దేశంలో అవినీతి ఎప్పుడు అంతమవుతుందోనని సామాన్య జనం నిట్టూర్పు విడిచి ఉండవచ్చు. కానీ, అవినీతికి చిరునామాగా మారిన రాజకీయ వ్యవస్థ మారనంతకాలం అవినీతిని దేశంనుంచి పారదోలడం అత్యాసే అవుతుందని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చుమీరుతున్న అవినీతి గురించి సర్వోన్నత న్యాయస్థానం సైతం పలు సందర్భాల్లో ఆందోళన వెలిబుచ్చినా మన నాయకమ్మన్యులలో చలనం మాత్రం కలగడం లేదు. పటుతరమైన చట్టాలు చేసి, అవినీతిపై ఉక్కుపాదం మోపి అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన రాజకీయ నేతలే కాసులకు కక్కుర్తిపడి, దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు. అవినీతిని అరికడతామంటూ ప్రతినలు పలికే నేతలు ఆచరణలో అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తించడం దౌర్భాగ్యం కాక మరేమిటి? అవినీతి కేసులలో ఇరుక్కుని బెయిల్ పై బయటకు వచ్చినవారే అక్రమాలను అరికడతామంటూ ప్రగల్భాలు పలుకుతుంటే నమ్మడం ఎలాగంటూ సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీయే ఒక సందర్భంలో ఆక్రోశం వెలిబుచ్చారంటే రాజకీయాలు నైతికంగా ఎంతగా పతనమయ్యాయో అర్థం చేసుకోవచ్చు.లోక్‌సభకు కొత్తగా ఎన్నికైనవారిలో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆ మధ్య అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ సంస్థ చేపట్టిన అధ్యయనంలో తేలడం ఇందుకు మరో ఉదాహరణ. ఆ మాటకొస్తే, అవినీతిని అరికట్టేందుకు మనకు ఉన్న సంస్థలు, చట్టాలు బోలెడు. అవినీతి నిరోధక శాఖ, కేంద్ర దర్యాప్తు సంస్థ, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు, అవినీతి నిరోధక చట్టం, ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్, ప్రజావేగుల చట్టాలు, సమాచార హక్కు చట్టం వంటివి అనేకం ఉన్నా, అవినీతి అణువైనా తగ్గకపోవడానికి కారణాలు అనేకం. దర్యాప్తు సంస్థలు ఎంతో శ్రమించి అవినీతిపరులను గుర్తించి అరెస్టు చేస్తున్నా, ఆయా కేసులలో శిక్షపడుతున్నది కొద్దిమందికి మాత్రమేనంటే ఆశ్చర్యం కలుగకమానదు. చట్టాలలోని లొసుగులు, న్యాయస్థానాల్లో ఏళ్లూపూళ్లూ పడుతున్న విచారణ, సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోవడం వంటివి ఇందుకు కొన్ని కారణాలుగా చెప్పుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే జనాభాతో కిటకిటలాడే ఆసియా దేశాలలో అవినీతి మరీ పెచ్చరిల్లిపోతోంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన ర్యాంకుల్లో మొత్తం 180 దేశాల జాబితాలో భారత దేశానిది 96వ స్థానం. ఈ ర్యాంకు ఏ ఏటికాయేడు అంతకంతకు దిగజారిపోతూ ఉండటం మరీ సిగ్గుచేటు. ఇక పాకిస్తాన్ వంటి దేశాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ప్రపంచవ్యాప్తంగా ఏటా ట్రిలియన్ డాలర్లు అవినీతిపరుల ఖాతాల్లోకి చేరుతోందంటూ ఆ మధ్య ఐక్యరాజ్య సమితి సైతం ఆందోళన వెలిబుచ్చింది. అవినీతికి అడ్డుకట్ట వేయగలిగితే ప్రభుత్వాలకు మరింత ఆదాయం సమకూరుతుందనడంలోనూ, ప్రజల జీవితాలు మెరుగుపడతాయనడంలోనూ సందేహం లేదు.అయితే పిల్లిమెడలో గంట ఎవరు కడతారన్నదే ప్రశ్న. అవినీతి నిర్మూలన ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. ప్రజలూ కీలక పాత్ర పోషించవలసిందే. అవినీతికి తాము దూరంగా ఉండటంతోపాటు అవినీతిపరులను ఎక్కడికక్కడ నిలదీయగలగాలి. ప్రజాచైతన్యం రగిలితే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. అదే సమయంలో ప్రభుత్వాలు చట్టాలలోని లొసుగులను సవరించి, చట్టాలను లోపరహితంగా రూపొందించాలి. అవినీతిపరులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాలను సవరించాలి. ప్రభుత్వ కార్యకలాపాలను వీలైనంతవరకూ ఆన్‌లైన్ విధానం ద్వారా నిర్వహిస్తే అవినీతికి ఆస్కారం ఉండదు. బొగ్గు గనులను వేలం వేసేందుకు ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.

# వైభవ్‌కు ద్రావిడ్, లక్ష్మణ్ తోడ్పాడు

అతి పిన్న వయసులో ఐపీఎల్ లోకి ఎంట్రీ ఇవ్వడం తోనే రికార్డుల వేట మొదలుపెట్టాడు రాజస్థాన్ రాయల్స్ వైభవ్ సూర్యవంశి. గుజరాత్ టైటాన్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ 101 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 35 బంతుల్లోనే అద్భుత శతకం సాధించి ఔరా అనిపించాడు. వైభవ్ సూర్యవంశీ ఇంతటి పేరు సాధించడం, గుర్తింపు దక్కించుకోవడంలో ఇద్దరి కృషి దాగి ఉంది. వైభవ్ విజయం వెనుక రాజస్థాన్ రాయల్స్ జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్, సన్ రైజర్స్ మెంటార్ వీవీఎస్ లక్ష్మణ్ తోడ్పాడు ఉంది. %శ్రూా%లో డెబ్యూ మ్యాచ్‌లోనే వైభవ్ సూర్యవంశి సిక్స్ తో కెరీర్ మొదలుపెట్టాడు. విధ్వంసక ఆటతీరుతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. మొన్న అరంగేట్రంలో తొలి బంతికే సిక్స్ కొట్టిన చిచ్చరపిడుగు 34 పరుగులు చేసి ఔటయ్యాడు. అంతకుముందు అండర్-19 టోర్నమెంట్‌లో అవకాశం దక్కిన సమయంలో తొలి మ్యాచ్ అనంతరం ఆనంద భాష్పాలు రాల్చాడు. వైభవ్ సూర్యవంశీ టాలెంట్ మొదట గుర్తించింది వీవీఎస్ లక్ష్మణ్. .అండర్-19 వన్డే ఛాలెంజర్ టోర్నమెంట్‌లో ఇండియా %దీ% జట్టు తరఫున ఆడుతూ 36 పరుగులు చేసి వైభవ్ సూర్యవంశీ ఔటయ్యాక భావోద్వేగానికి లోనయ్యాడు, డ్రెస్సింగ్ రూమ్‌లో కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఆ సమయంలో వీవీఎస్ లక్ష్మణ్ యువ సంచలనం వైభవ్ ను కలిసి మాట్లాడాడు. క్రికెటర్ ఎలా ఉండాలి, అతడి నుంచి జట్టు ఏం కోరుకుంటుందో చెప్పాడు. వైభవ్ కోచ్ మనోజ్ ఓజా స్పోర్ట్‌స్టార్‌తో ఇలా ఉన్నారు. వైభవ్ ఆ మ్యాచ్‌లో వైభవ్ 36 పరుగులకు ఔట్ అయ్యాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఏడుస్తున్నప్పుడు వీవీఎస్ లక్ష్మణ్ అతన్ని చూసి ఓదార్చాడు. మేం కేవలం పరుగులు చేయడం మాత్రమే కాదు, దీర్ఘకాలం ఆడే నైపుణ్యం ఉన్న ఆటగాళ్ల గురించి నిత్యం అన్వేషిస్తుంటాం అని చెప్పాడు. మంచి నైపుణ్యం ఉందని, సామర్థ్యాన్ని మెరుగు పరుగుకోవాలని సూచించాడు. త్వరలోనే %దీజజ×% నుంచి సీనియర్ జట్టుకు అవకాశం లభిస్తుందని వైభవ్ కు కాన్ఫిడెన్స్ ఇచ్చాడు. అండర్ 19 ఆడే టైంలో వైభవ్ వయసు కేవలం 13ఏళ్లే. దాంతో నెక్ట్స్ లెవల్ కి వెళ్లటానికి ఇబ్బందులు ఎదురువుతుంటే అప్పుడు నేషనల్ క్రికెట్ అకాడమీ ఛైర్మన్ లక్ష్మణ్ దృష్టికి తీసుకువెళ్లారు కోచ్ బ్రజేష్ ఝా. అదే అతడికి టర్నింగ్ పాయింట్ అయింది. రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్‌కు బాలుడు వైభవ్ సూర్యవంశి పేరును వీవీఎస్ లక్ష్మణ్ సిఫార్సు చేశాడు. మంచి టాలెంటెడ్ అని, సానపెడితే మరింత ఎదుగుతాడని.. అవకాశం ఇవ్వాలని సూచించాడు. లక్ష్మణ్ మాటలను పరిగణనలోకి తీసుకున్న ద్రావిడ్.. వైభవ్ సూర్యవంశీ మ్యాచ్ వీడియోలు, షాట్ సెలక్షన్ గమనించారు. గత ఏడాది చివర్లో జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో వైభవ్ సూర్యవంశీని రాజస్తాన్ రాయల్స్ కొనుగోలు చేయడానికి ఒప్పించాడు. వైభవ్ ప్రారంభ మ్యాచ్‌లలో ఆడలేదు, అతనికి మొదటి అవకాశం ఎప్పుడిస్తారు అనే దానిపై ద్రవిడ్ స్పందించాడు. "వైభవ్ మ్యాచ్ ఆడటం లేదు కానీ, మ్యాచ్ కోసం మంచి శిక్షణ తీసుకుంటున్నాడు. టాలెంట్ ఉన్న క్రికెటర్ గా ఎదుగుతాడు. పెద్ద క్రికెట్ వాతావరణానికి అలవాటు పడుతున్నాడు. అతడికి మరికొంత సమయం ఇస్తున్నాం. త్వరలోనే వైభవ్ మ్యాచ్ ఆడతాడని ద్రావిడ్ ఇటీవల చెప్పారు. సరైన సమయం చూసి అతడ్ని ప్లేయింగ్ 11కి సెలక్ట్ చేస్తాం. ఈ విషయంలో మాకు ఏ భయం, సందేహం లేదు. టీం కోసం ఎలా ఆడాలి, పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ద్రావిడ్ నుంచి శిక్షణ తీసుకున్న వైభవ్ రాజస్థాన్ టీం తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. 14 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ 1.1 కోట్ల రూపాయలకు వేలంలో తీసుకుంది. ఇటీవల తుది జట్టులో ఛాన్స్ కాగా, టోర్నమెంట్‌లో ఆడిన 3 మ్యాచ్‌లలో మొత్తం 151 పరుగులు చేశాడు. %శ్రూా% చరిత్రలో అత్యంత వేగంగా శతకం చేసిన రెండో బ్యాటర్ గా, భారత్ నుంచి ఫాస్టెస్ట్ సెంచరీ బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ లో భారీ టార్గెట్ ముందున్నా కేవలం 35 బంతుల్లో శతకం సాధించి ఔరా అనిపించాడు.



# పృథ్వీషా ఐకాన్ ప్లేయర్‌గా ఎంపిక



పృథ్వీషా.. ఒకప్పుడు టీమిండియా రైజింగ్ స్టార్‌గా పరిగణించబడ్డాడు. రాబోయే రోజుల్లో పృథ్వీషా భారత జట్టుకు కీలక బ్యాటర్ అవుతాడని.. భారత జట్టుకు కూడా నాయకత్వం వహిస్తాడని భావించారు. కానీ పేలవమైన ఫామ్, ఫిట్‌నెస్ పృథ్వీని వెనక్కి లాగేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో పృథ్వీ షాను ఏ ఫ్రాంచైజీ కూడా కొనుగోలు చేయలేదు. కానీ ఇప్పుడు మరో లీగ్ పృథ్వీ షాకు మద్దతు ఇచ్చింది. ఆ లీగ్ అతడిని ఏకంగా ఐకాన్ ప్లేయర్‌గా మార్చింది. ప్రస్తుతం దేశంలో ఐపీఎల్ తరహాలో ప్రతి రాష్ట్రం టీ20 లీగ్‌లను నిర్వహిస్తున్నాయి. ముంబై క్రికెట్ అసోసియేషన్ కూడా ఒక టీ20 లీగ్ ను నిర్వహిస్తోంది. దీన్ని ముంబై టీ20 లీగ్ అని పిలుస్తారు. ఈ లీగ్ మూడో సీజన్ ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ తర్వాత ప్రారంభమవుతుంది. పృథ్వీషా ఈ లీగ్ ఐకాన్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు.ముంబై టీ20 లీగ్‌లో మొత్తం 8 మంది ఆటగాళ్లను ఐకాన్ ప్లేయర్లుగా ఎంపిక చేశారు. ఇందులో పృథ్వీషాతో పాటు సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, అజింక్యా రహానే, సర్ఫరాజ్ ఖాన్, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే, తుషార్ దేశ్ పాండే పేర్లు ఉన్నాయి. ఈ లీగ్‌లో 8 ఫ్రాంచైజీలు ఉన్నాయి. ప్రతి ఫ్రాంచైజీ తన కోసం ఒక ఐకాన్ ఆటగాడిని ఎంచుకుంటుంది. ఈ లీగ్ వేలం తేదీలను ముంబై క్రికెట్ అసోసియేషన్ త్వరలో ప్రకటించనుంది. ఈ లీగ్ ఆరు సంవత్సరాల తర్వాత తిరిగి వస్తోంది. ఇది మూడో సీజన్ కావడం గమనార్హం. లీగ్ చివరి సీజన్ కొవిడ్ కంటే ముందే జరిగింది. ఈ లీగ్‌లో చాలా మంది కళ్లు పృథ్వీషా పైనే ఉంటాయి. పృథ్వీషా టీమిండియాలోకి తిరిగి రావాలని కోరుకుంటున్నాడు. ఈ లీగ్ పృథ్వీషాకు తన కెరీర్ ప్రారంభ రోజుల్లో కనిపించిన ప్రతిభ ఇంకా ఉందని నిరూపించుకోవడానికి అవకాశం ఇస్తుంది. పృథ్వీషాకు టీమిండియాలోకి తిరిగి రావాలంటే అంత సులభమేమీ కాదు. కానీ అతడికి ఇంకా తలుపులు పూర్తిగా మూసుకుపోలేదు. కానీ పృథ్వీషా తిరిగి రావాలంటే అసాధారణంగా రాణించాల్సి ఉంటుంది. అప్పుడే మళ్లీ టీమిండియాలోకి వచ్చే అవకాశాలు ఉంటాయి. ముంబై టీ20 లీగ్ మే 26 నుంచి జూన్ 8 వరకు వాంఖడే స్టేడియంలో నిర్వహించబడుతుంది.



# శ్రీవారి సేవలో టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్

టీమిండియా మాజీ పేసర్ శ్రీశాంత్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొన్నాడు శ్రీశాంత్. ఈ సందర్భంగా ఆలయంలోని వేద పండితులు శ్రీశాంత్ కుటుంబ సభ్యులకు వేదశీర్వచనం అందజేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.అలాగే పట్టు వస్త్రాలతో శ్రీశాంత్ దంపతులను సత్కరించారు. ఇక దర్శనానంతరం బయటకు వచ్చిన శ్రీశాంత్ తో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీ పడ్డారు.ఇక ఆలయం వెలుపల శ్రీశాంత్ మీడియాతో మాట్లాడుతూ%శొ% కుటుంబ సభ్యులతో . శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నాడు.ఇక ఐపీఎల్-2025పై స్పందిస్తూ చిన్న వయస్సులో వైభవ్ సూర్య వంశి అద్భుతమైన రీతిలో పరుగులు సాధిస్తున్నారని ప్రశంసలు కురిపించాడు. కామెంట్రీ బాక్స్ నుంచి ఆ మ్యాచ్ చూస్తూ ఉండటం చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నాడు శ్రీశాంత్.

# వైభవ్ ఖాతాలో పలు ప్రపంచ రికార్డులు

జరాత్ టైటాన్స్ పై మెరుపు సెంచరీ సాధించిన రాజస్థాన్ రాయల్స్ టీనేజర్ వైభవ్ సూర్యవంశీ (38 బంతుల్లో 101, 7 ఫోర్లు, 11 సిక్సర్లు) పలు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టాడు. టీ20 ఫార్మాట్లో అత్యంత పిన్న వయసులో సెంచరీ చేసిన ప్లేయర్ గా నిలిచాడు. గుజరాత్ పై 14 ఏళ్ల 32 రోజుల వయసులో సెంచరీ చేసిన వైభవ్.. గతంలో ఇండియాకే చెందిన విజయ్ జోల్ (18 ఏళ్ల 118 రోజులు) పేరిట ఉన్న రికార్డును తిరగ రాశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో భాగంగా మహారాష్ట్ర తరపున విజయ్ ఈ సెంచరీని సాధించాడు. భారీ తేడాతో ఈ రికార్డును వైభవ్ కొల్లగొట్టడం విశేషం. దాదాపు 4 ఏళ్ల 86 రోజుల తేడాతో ఈ రికార్డ్నును తన కైవసం చేసుకున్నాడు. అలాగే ఐపీఎల్లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన ఇండియన్ ప్లేయర్ గాను వైభవ్ రికార్డులకెక్కాడు. కేవలం 35 బంతుల్లో సెంచరీ చేసిన వైభవ్.. గతంలో యూసుఫ్ పఠాన్ (37 బాల్స్) ముంబై ఇండియన్స్ పై చేసిన రికార్డును తిరగ రాశాడు. ఓవరాల్ గా ఈ అత్యంత ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉంది. ఇక ఐపీఎల్లో అత్యంత పిన్న వయస్కులో సెంచరీ చేసిన రికార్డును కూడా వైభవ్ తన ఖాతాలో వేసుకున్నాడు. గతంలో ఈ రికార్డు మనీశ్ పాండే (19 ఏళ్ల 253 రోజులు) పేరిట ఉండేది. తాజా ప్రదర్శనతో ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే టీ20ల్లో ఫిఫ్టీ చేసిన యంగెస్ట్ ప్లేయర్ గాను రికార్డులకెక్కాడు. గతంలో ఈ రికార్డు అఫ్ఘానిస్థాన్ మాజీ కెప్టెన్ మహ్మద్ నబీ కుమారుడు మసన్ ఐసాకిల్ పేరిట ఉండేది. తను 15 ఏళ్ల 360 రోజుల వయసులో ఆఫ్ఘన్ లోకల్ లీగ్ అయిన స్పాగీజా లీగ్ లో ఈ రికార్డును నమోదు చేశాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సూర్యవంశీ.. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో ఒక్కసారిగా టాప్ గేర్ లోకి వెళ్లాడు. వెటరన్ ఇషాంత్ శర్మ బౌలింగ్ లో ఏకంగా 28 పరుగులు సాధించాడు. ఇందులో మూడు సిక్సర్లు, 2 ఫోర్లు ఉండటం విశేషం. ఇక ఆ 10వ ఓవర్ వేసిన అరంగేట్ర ఆటగాడు కరీం జనత్ వేసిన ఓవర్లో ఏకంగా 30 పరుగులు పిండుకున్నాడు. ఇక 35 బంతుల్లో సెంచరీ చేశాక ఆఖరికి ప్రసిధ్ కృష్ణకు వికెట్ సమర్పించుకున్నాడు. మొత్తం మీద ఈ మ్యాచ్ ద్వారా రాయల్స్ తిరిగి విజయాల బాట పట్టింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 209 పరుగులు చేసింది. శుభమాన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ (50 బంతుల్లో 84, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. మహీషా తీక్షణకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం సూర్యవంశీ జోరుతో ఛేదనలో రాయల్స్ కేవలం 15.5 ఓవర్లలో 2 వికెట్లకు 212 పరుగులు చేసి సునాయాస విజయం సాధించింది.




# మహిళల ట్రై సిరీస్‌లో భారత్ వరుసగా రెండో విజయం

మహిళల ట్రై సిరీస్‌లో భారత్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మంగళవారం సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్?లో టీమ్‌ఇండియా 15 పరుగుల తేడాతో నెగ్గింది. భారత్ నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. తంజీమ్ బ్రిట్స్ (101) సెంచరీ వృథా అయ్యింది. టీమ్‌ఇండియా బౌలర్లలో స్నేహ్ రానా 5 వికెట్లతో సఫారీ జట్టును శాసించింది. అరుంధతి, చరని, దీప్తి శర్మ, తలో 1 వికెట్ దక్కించుకున్నారు.ఛేదనను సౌతాఫ్రికా ఘనంగా ఆరంభించింది. ఓపెనర్లు లారా (43), తంజీమ్ (109) తొలి వికెట్?కు 140 పరుగులు జోడించారు. ఈ దశలో ఆశల్లేని స్థితిలోంచి భారత్ బౌన్స్ బ్యాక్ అయ్యింది. లారాను దీప్తి శర్మ పెవిలియన్ చేర్చి టీమ్‌ఇండియాకు తొలి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత స్నేహ్ రానా సౌతాఫ్రికాను బ్యాటింగ్?ను కుప్ప కూల్చింది. ఏకంగా ఐదు వికెట్లు దక్కించుకుంది. భారీ భాగస్వామ్యాలు నెలకొల్పకుండా చూసుకున్న బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టి భారత్?కు సంచలన విజయం అందించారు.అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రతీకా రావల్ (78) ఫామ్ కొనసాగిస్తూ మరో హాఫ్ సెంచరీ చేసింది. హర్మన్ ప్రీత్ (41), జెమీమా (41), స్మృతి మంధాన (36), హర్లీన్ (29), రిచా ఘోష్ (24) రాణించారు. సౌతాఫ్రికా బౌలర్లలో మ్లాబా 2, ఖాకా, క్లాస్, డి క్లెర్క్, అన్నెరీ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.ఈ సిరీస్?లో టీమ్‌ఇండియా ఆడిన రెండు మ్యాచ్?ల్లోనూ నెగ్గింది. తాజా విజయంతో భారత్ పట్టికలో 4 పాయింట్లతో టాప్?లో ఉంది. తదుపరి మ్యాచ్? మే 04న శ్రీలంకతో తలపడాల్సి ఉంది.



# వైభవ్ 'బేబీ బాయ్' కాదు.. బీభత్సానికి కేరాఫ్



పాలబుగ్గల పిల్లాడిని అనామకుడు అనుకుంటే హడలెత్తించాడు. పద్నాలుగేళ్ల వయసులోనే రికార్డు సెంచరీతో చరిత్ర పుటల్లో తన పేరు రాసుకున్నాడు. అతడే వైభవ్ సూర్యవంశీ. ఐపీఎల్ 18వ సీజన్‌లో 265.78 స్ట్రయిక్ రేటుతో శతకం బాది 'టాక్ ఆఫ్ ది వరల్డ్ అయ్యాడీ కుర్రాడు. తన పవర్ స్ట్రోక్‌తో విధ్వంసక శతకం బాదిన వైభవ్.. తాను 'బేబీ బాయ్ కాదని బీభత్సానికి కేరాఫ్' అని ప్రపంచానికి చాటాడు. జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై వైభవ్ ఊచకోత చూసినవాళ్లంతా ముక్తకంఠంతో ఇప్పుడిదే మాట అంటున్నారు.టీమిండియా దిగ్గజం రవిశాస్త్రి భవిష్యత్‌లో భారత జట్టుకు ఆడే క్రికెటర్లలో వైభవ్ కచ్చితంగా ఉంటాడని చెప్పేశాడు. ఇక ఎంఎస్ ధోనీ అయితేఈ పిల్లాడు చాలా అనుభవజ్ఞుడిలా ఆడుతున్నాడు. అతడికి ఎంతో భవిష్యత్ ఉందని తమతో చెప్పాడని రాజస్థాన్ జట్టు మేనేజర్ రోమి భిందెర్ తెలిపాడు.



# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్

### - 2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన

ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకటైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రుర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగస్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వారం క్రితం యంగ్ టైగర్ ఈ సినిమా సెట్స్ లో పాల్గొన్నారు.

# హీరోల కోసం త్రివిక్రమ్ చూపు

### - వెంకటేశ్‌తో చేస్తాడన్న ప్రచారం

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పైనే అందరి చూపు ఉన్నా..ఆయన చూపు ఎవరి వైపు అన్నదే ఇప్పుడు చర్చ. నిత్యం పెద్ద హీరోలు, భారీ బడ్జెట్ సినిమాలతో త్రివిక్రమ్ కాంపౌండ్ కళకళలాడేది. కానీ ఇప్పుడు వెలవెల బోతోంది. త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు హీరోలు దొరకని పరిస్థితి. హీరో అంటే ఇక్కడ స్టార్ హీరోలండి బాబు. ఈ పరిస్థితి రావడానికి కారణం కూడా మన గురూజీనే. కేవలం స్టార్ హీరోలతో మాత్రమే సినిమాలు చేస్తానని పట్టుబడతాడు. అదే దెబ్బ కొట్టేసింది. ఎందుకంటే స్టార్ హీరోలు అందరూ పాన్ ఇండియా బడ్జెట్ లో చేసేస్తున్నారు. పైగా రియలస్టిక్ సినిమాలకే జెండా ఊపుతున్నారు. క్లాస్ సినిమాలు తీసే త్రివిక్రమ్ కు ఇది అడ్డంకిగా మారింది. బన్నీతో సినిమా ఉంటుందని ప్రచారం జరిగినా.. అది ఇప్పట్లో ఉండేలా



కనిపించలేదు. అట్లీ మూవీ అయ్యాకే ఉంటుంది. దానికి ఇంకో మూడేళ్లు పడుతుంది. అప్పటి దాకా ఖాళీగా ఉండటం కన్నా వెంకటేశ్ తో తీస్తే బెటర్ అంటున్నారు. కానీ దానికి త్రివిక్రమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావట్లేదు. త్రివిక్రమ్ తో చేయడానికి వెంకీ సిద్ధంగానే ఉన్నాడు. ప్రస్తుతం భారీ హిట్ తో ఖాళీగా ఉన్నాడు. కాబట్టి వెంకీతో మూవీ చేసి తానేంటూ త్రివిక్రమ్ నిరూపించుకుంటే బెటర్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. వెంకీ నటించిన ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ డైలాగులు రాశాడు. ఇద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ పెద్ద హిట్. కాబట్టి మళ్లీ ఓ మూవీ చేస్తే బాగుంటుందని వీరి ఫ్యాన్స్ అంటున్నారు. మరి త్రివిక్రమ్ ఏం చేస్తాడో చూడాలి.

# గురునానక్ పాత్రలో అమీర్ ఖాన్ పోస్టర్

### - అది నకిలీదంటూ టీమ్ స్పష్టీకరణ

బాలీవుడ్ మిస్టర్ ఫర్ఫెక్ట్ అమీర్ ఖాన్.. సిక్కు మతస్థుల దైవం అయిన గురునానక్ బయోపిక్ చేస్తున్నట్లు అతడి రూపంలో ఉన్న ఒక పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.. తాజాగా ఈ వార్తలపై అమీర్ ఖాన్ టీమ్ స్పందించింది. ఆ పోస్టర్ పూర్తిగా నకిలీదని, అది కృత్రిమ మేధస్సు ద్వారా సృష్టించిన పోస్టరని టీమ్ చెప్పుకొచ్చింది. ఈ విషయంపై అమీర్ ఖాన్ టీం స్పందిస్తూ.. గురునానక్‌గా అమీర్ ఖాన్‌ను చూపిస్తున్న పోస్టర్ పూర్తిగా నకిలీది. దానిని ఎఐ ద్వారా తయారు చేశారు. అమీర్ ఖాన్‌కు అలాంటి ప్రాజెక్ట్‌తో ఎలాంటి సంబంధం లేదు. ఆయన గురునానక్‌ను ఎంతో గౌరవిస్తారు. ఎలాంటి అగౌరవకరమైన చర్యలకు ఆయన మద్దతు ఇవ్వరు. దయచేసి ఇలాంటి నకిలీ వార్తలను నమ్మవద్దని పేర్కొన్నారు.ఈ పోస్టర్‌ను ఒక నకిలీ యూట్యూబ్ ఛానెల్ ద్వారా వ్యాప్తి చేయడంతో సిక్కు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ ఘటనపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీకి కూడా ఫిర్యాదు అందింది. ఇది మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు జరిగిన ఉద్దేశపూర్వక ప్రయత్నంగా ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ ఈ మోసాన్ని వెంటనే బహిరంగంగా ఖండించాలని, తమకు దీనితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది.





# వరుణ్ తేజ్..మేర్లపాక కాంబోలో మూవీ

బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో డౌన్ ఫాల్ లో ఉన్నాడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మట్కా మొదటి ఆటకే మకాం సర్దేసింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని కథలపై దృష్టి పెట్టిన ఈ మెగా హీరో యంగ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు కొరియన్ కనకరాజ్ అనే క్రేజీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో జరుగుతుంది. సినిమాలో వచ్చే ఐటమ్ సాంగ్ కోసం అక్కడ నిర్మించిన ప్రత్యేక సెట్స్ లో సాంగ్ షూట్ చేస్తున్నారు. ఈ కోసం హాట్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారు. హుషారు, బంగార్రాజు వంటి సినిమాలలో మెప్పించిన దక్షా నాగర్కర్ కొరియన్ కనకరాజ్ లో వరుణ్ తేజ్ తో కలిసి ఆడిపాడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వలని భావిస్తున్నాడు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ తైక్వాండో లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. వరుణ్ తేజ్ కెరీర్ లో 15వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి వరుణ్ ఆశను మేర్లపాక గాంధీ నెరవేరుస్తాడో లేదో రానున్న రోజుల్లో తెలుస్తుంది.




# హిట్-3తో వస్తున్న నాని

హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి. ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్ 2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు. సంజయ్ దత్ ది భూత్నీ కూడా అదే రోజు భయపెట్టేందుకు వస్తోంది. ఈ సినిమాలకే పిచ్చ కాంపిటీషన్ ఉంటే హాలీవుడ్ నుండి థండర్ బోల్ట్స్ వివిధ భాషల్లో రిలీజౌతుంది. ఇంత టఫ్ కాంపిటీషన్ ఉన్నప్పటికీ.. దేర్ చేసి వస్తున్నాడు నాని. ఇప్పటికే విపరీతమైన ప్రమోషన్లను చేసిన న్యాచురల్ స్టార్. వీటికి తోడు ఐపీఎల్ ఉండనే ఉంది. మరీ ఇన్ని అవరోధాలను దాటుకుని నాని హిట్3 ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.



# చిత్రదర్శకురాలుకు అరుదైన గౌరవం

### - ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీలో కపాడియాకు చోటు

భారతీయ చలనచిత్ర దర్శకురాలు పాయల్ కపాడియాకి అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 జ్యూరీలో పాయల్ చోటు దక్కించుకున్నారు. గతేడాది పాయల్ దర్శకత్వంలో వచ్చిన 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్స అనే చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ పిక్స్ అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ముంబై, కొంకణ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం మహిళా స్నేహం, ప్రేమ ఆకాంక్షల గురించి రూపొందించబడింది. ఈ సినిమా విడుదలై ప్రశంసలు అందుకోవడమే కాకుండా.. 30 సంవత్సరాల తర్వాత కేన్స్ ఫెస్టివల్‌లో నిలిచిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా చోటు దక్కించుకుంది. ఈ వేడుకలో ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ అధ్యక్షురాలిగా ఫ్రెంచ్ నటి జూలియెట్ బినోష్ వ్యవహరించనుండగా.. జ్యూరీలో పాయల్‌తో పాటు హాలీవుడ్ నటి హాలీ బెర్రీ, ఇటాలియన్ నటి ఆల్బా రోర్‌వాచర్, కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్సూ, కాంగోలీస్ దర్శకుడు డైయెడో హమాడి, మెక్సికన్ దర్శకుడు కార్లోస్ రేగాడాస్, ఫ్రెంచ్–మొరాకన్ రచయిత్రి లీలా స్లిమాని కూడా సభ్యులుగా చోటు దక్కించుకున్నారు. గతేడాది దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాయల్ ఈసారి జ్యూరీ సభ్యురాలిగా కేన్స్‌లో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ చలనచిత్రోత్సవం మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరగనుంది.



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656